


- నోరూరించే తెనాలి బెల్లం జిలేబి
- ఆరు దశాబ్దాల నుంచి తెనాలికి ప్రత్యేకం
- దేశ విదేశాల్లోని జిలేబి ప్రియుల కోసం ఇక్కడి నుంచి పార్సిల్స్
- ఒక వీధికే జిలేబి కొట్ల బజారుగా పేరుతెచ్చిపెట్టి..

8



## తరాలు మారినా.. తరగని తియ్యదనం




# వైసీపీకి.. పచ్చధనం



ఆహ్లాదం పంచాల్సిన చెట్లు.. మొక్కలు వైసీపీ నేతలకు కాసులు కురిపించాయి. సాధారణంగా ముఖ్యమంత్రిగా జగన్ ఎక్కడికైనా వస్తున్నాడంటే ఆ ప్రాంతంలో పెద్దపెద్ద వృక్షాలు కొట్టాల్సిందే. అలా కొట్టిన చెట్లు వైసీపీ నేతలు అమ్మేసుకుని సొమ్ము చేసుకు నే వారు. అదేవిధంగా ఉమ్మడి గుంటూరు జిల్లాలో గత ఐదేళ్లలో జరిగిన ముఖ్యమంత్రి సభా ప్రాంగణాల అలంకరణకు పెద్దఎత్తు న మొక్కలు కొనుగోలు చేసేవారు. ఆ తర్వాత ఆ మొక్కలను కూడా అమ్మేసుకుని సొమ్ములు జేబుల్లో వేసుకునే వారు. ఇలా వైసీపీ హయాంలో కొట్టేసిన చెట్లు.. సభాలంకరణలకు కొనుగోలు చేసిన మొక్కలు కాసులు కురిపించాయి. అధికారులు, నేతలు ఎక్కడికక్కడ కుమ్మక్కై పచ్చధనంతో జేబులు నింపుకునేవారు. ఇసుక నుంచి తైలం తీయడం కష్టమేమో కానీ, గత వైసీపీ ప్రభుత్వ హయాంలో దేని నుంచైనా కాసులు కురిపించొచ్చనేది నిరూపించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక గత ప్రభుత్వ కాలంలో జరిగిన ఘరానా దోపిడీ సంఘటనలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. వీటిలో కొన్ని సంఘటనలు చూస్తే ఈ రూపంలోనూ దోచుకో వచ్చా! అన్న ఆశ్చర్యం కలగక మానదు. అటువంటి వాటిలోదే మొక్కల కొనుగోళ్లు, అమ్మకాల కోణం.









- జగన్ సభలకు మొక్కల పేరిట దోపిడీ
- చెట్లు కొట్టినా.. మొక్కలు కొన్నా కాసులే కాసులు
- వైసీపీ నేతలు, మున్సిపల్ సిబ్బంది కుమ్మక్కు
- పట్టణాల సుందరీకరణ మొక్కలూ అమ్మకాలు
- కూటమి ప్రభుత్వంలోనూ మున్సిపాల్టీల్లో అక్రమాలు
- పట్టణ పార్కుల్లో నాటాల్సిన మొక్కలు కూడా మాయం

తెనాలి, అక్టోబరు 17 (ఆంధ్ర జ్యోతి): గత వైసీపీ హయాంలో మహా వృక్షాలపై గొడ్డలి వేటు పడిందంటే, చెట్లు నేలకొరిగాయంటే ఒక్కటే గుర్తు.. అక్కడికి జగనన్న వస్తున్నాడని. ఇది జనానికి తెలిసిన ఒకవైపు కోణమే. మరో కోణంలో.. జగన్ వస్తున్నాడంటే రూ.లక్షల విలువైన మొక్కలనూ కొనుగోలు చేసేవారు. రోడ్ల వెంట మహా వృక్షాలు నేలవాలి, పచ్చదనం మాయమై మోడువారినా పర్వాలేదు కానీ, జగన్ పాల్గొనే ప్రాంతం పచ్చగా కనిపించాలట. దీనిని అడ్డుపెట్టుకుని కొందరు నేతలు, మున్సిపల్ సిబ్బంది లెక్కలేనంత ప్రజాధనాన్ని దోచేశారు. చెట్లు.. మొక్కలు.. ఆహ్లాదాన్ని, ఆనందాన్ని పంచుతాయని అందరికీ తెలుసు. కానీ కాసులు కూడా కురిపిస్తాయని, మొక్కల మాటున రూ.కోట్లు వెనకేయవచ్చని వైసీపీ నేతలు నిరూపించారు. తాడేపల్లి ప్యాలస్ నుంచి జగన్ బయటకు అడుగుపెడితే పచ్చని చెట్లను నిర్దాక్షిణ్యంగా నరికివేయించేవారు. అదే సమయంలో (మిగతా 8వ పేజీలో..)



భారీ క్రేన్‌లు, కోత యంత్రాలతో మనుషులనుపెట్టి నరికేస్తున్న మహా వృక్షాలు



ఇంతటి భారీ మొద్దులతో తరలిపోయిన లారీలు.. ఇటువంటి కలపనే టన్ను రూ.1100కి కట్టబెట్టేశారు



# 50% ఇవ్వాల్సిందే

- మద్యం వ్యాపారులకు బెదిరింపులు
- నరసరావుపేటలో ప్రారంభం కాని షాపులు
- వాటా ఇప్పిస్తామని వసూళ్లు చేపట్టిన నేతలు
- టీడీపీ నేతల మధ్య మద్యం వ్యాపారం రగడ



(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

మద్యం షాపుల దరఖాస్తుల ప్రక్రియ నుంచి ప్రారంభమైన బెదిరింపులు ఇంకా కొనసాగుతున్నాయి. ప్రభుత్వ మద్యం వ్యాపారం ప్రైవేటుకు మారగా దానిని చేజిక్కించుకునేందుకు టీడీపీ నేతలు వారి అనుచరుల ద్వారా ముమ్మర ప్రయత్నాలు చేశారు. ఈ క్రమంలో దరఖాస్తుల దాఖలకు వ్యాపారులు వెనుకంజ వేయగా టీడీపీ అధిష్ఠానం రంగంలోకి దిగి హెచ్చరికలు చేసింది. దీంతో లాటరీ ప్రక్రియ వరకు జోక్యం చేసుకోలేదు. మద్యం దుకాణాలను దక్కించుకున్న వారు వాటి ఏర్పాటుకు సిద్ధమవుతున్న క్రమంలో మళ్లీ టీడీపీ నేతలు రంగంలోకి దిగారు. లైసెన్సు ఘట్టం ముగిశాక 50 శాతం వాటా ఇవ్వాల్సిందేనని పట్టుపడుతున్నారు. అయితే ఎక్కడా లేనట్లు నరసరావుపేటలోనే మద్యం దుకాణాల విషయంలో టీడీపీ నేతల మధ్య రచ్చ జరుగుతుంది. షాపులు దక్కించుకుంది కూడా తెలుగుదేశం నేతలే కావడం.. వాటా అడుగుతున్న వారు ఆ పార్టీ వారే కావడం విశేషం. మద్యం షాపుల రచ్చ పార్టీకి నష్టం చేకుర్చేలా ఉందన్న వాదన పార్టీలో వినిపిస్తోంది. 50 శాతం వాటా ఇవ్వకుంటే వ్యాపారాలు ఎలా చేస్తారో చూస్తామంటూ బెదిరిస్తున్నట్లు బాధితులు తెలిపారు. ఈ వివాదం నేపథ్యంలోనే లాటరీ ఘట్టం ముగిసి మూడు రోజులైనా పలువురు నరసరావుపేటలో దుకాణాలు ప్రారంభించలేదని సమాచారం. మద్యం షాపుల రచ్చపై కొందరు నేతలు అధిష్ఠానం దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిసింది. కొన్ని షాపులను ప్రారంభిస్తామని ఎలా అడ్డుకుంటారో చూస్తామని షాపుల్లో వాటాదారులైన టీడీపీ నేతలు చెబుతున్నారు.

### వాటాల పేరుతో వసూళ్లు.. దరఖాస్తులు

మద్యం షాపుల్లో వాటాలు ఇప్పిస్తామని టీడీపీ నేతలు గ్రూపులుగా ఏర్పడ్డారు. ఐదు పైసలు వాటాకు రూ.7.50 లక్షలు చెల్లించాలని కొంత మొత్తాన్ని వసూలు చేసినట్లు చెబుతున్నారు. ఇలా వసూలు చేసిన డబ్బుతో పట్టణంలో 26, రూరల్ పరిధిలో 14 దరఖాస్తులు దాఖలు చేసినట్లు పార్టీ శ్రేణులు తెలిపాయి. అయితే రూరల్‌లో ఒక షాపు, పట్టణంలో ఒక షాపు లాటరీలో సదరు గ్రూపునకు దక్కాయి. మరో గ్రూపుగా ఏర్పడిన టీడీపీ నేతలు పట్టణంలోని ఏడు షాపులకు 60 దరఖాస్తులు, రూరల్ పరిధిలోని షాపులకు 25 దరఖాస్తులు దాఖలు చేశారు. ఈ గ్రూప్‌నకు రూరల్ పరిధిలో ఒక షాపు, పట్టణంలో ఐదు షాపులు లాటరీలో లభించాయి. అయితే వాటాల కోసం వసూలు చేసిన మొత్తాన్ని తిరిగి చెల్లించాలని పార్టీ శ్రేణులు కోరుతున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో షాపులు పొందిన వారిని వాటాలు కోరుతూ బెదిరింపులకు పాల్పడుతున్నట్లు ప్రచారం జరుగుతుంది.

### పోలీసుల అత్యుత్సాహం

లాటరీలో షాపులు పొందిన వారిని కొందరు టీడీపీ నేతలు పోలీసుల ద్వారా వేధింపులకు గురిచేస్తున్నారు. ఈ క్రమంలోనే బార్‌ల్లో పనిచేసే సిబ్బందిని స్టేషన్లకు తీసుకువెళ్లడం, బార్‌ల వద్ద డ్రంకన్ డ్రైవ్ కేసులు నమోదు చేయడమే ఇందుకు నిదర్శనమన్న వాదనలు వినిపిస్తున్నాయి. మద్యం షాపుల ఏర్పాటులో పోలీసు శాఖ పాత్ర లేదు. అయినా పోలీసులు మద్యం షాపుల విషయంలో అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారన్న విమర్శలున్నాయి. నరసరావుపేటలోని బార్ అండ్ రెస్టారెంట్లు ఉన్న నేతలు కొందరు లాటరీలో మద్యం షాపులు పొందారు. ఈ క్రమంలో బార్‌లలో పనిచేస్తున్న వ్యక్తులను పోలీసులు స్టేషన్‌కు తీసుకెళ్లి బెదిరిస్తున్నారు. దీనిపై వ్యాపారులు మండిపడుతున్నారు. మద్యం షాపుల విషయంలో టీడీపీలో నడుస్తున్న వివాదంలో పోలీసులు కీలకపాత్ర పోషిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. పోలీసుల చేత వ్యాపారులను బెదిరిస్తుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

# పల్నాడుకు.. నిధుల వరద

పల్నాడు జిల్లాలో రహదారుల రూపురేఖలు మారనున్నాయి. ప్రధాన రోడ్ల విస్తరణకు కేంద్ర ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు మంజూరు చేసింది. పార్లమెంట్ నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధికి కేంద్రం నుంచి నిధులు సాధించడంలో ఎంపీ, టీడీపీ పార్లమెంటరీ పక్ష నేత లావు శ్రీకృష్ణ దేవరాయలు విశేషంగా కృషి చేశారు. రహదారుల అభివృద్ధి చేస్తామని ఇచ్చిన ఎన్నికల హామీని నిలబెట్టుకున్నారు. జాతీయ రహదారులతో పాటు పలు రహదారుల నిర్మాణానికి రూ 3,476 కోట్లు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. పనులు చేపట్టేందుకు త్వరలోనే టెండరు ప్రక్రియ నిర్వహించనున్నారు.

- రహదారులకు రూ. 3,476 కోట్లు మంజూరు
- వినుకొండ - పేరేచర్ల రహదారికి రూ 2,360 కోట్లు
- నిధులు సాధనలో ఎంపీ శ్రీకృష్ణ దేవరాయలు సక్సెస్



గోతులు మయంగా కొండమోడు రహదారి



విస్తరించనున్న దుర్గి - వెల్దుర్తి రహదారి



ఎంపీ శ్రీకృష్ణ దేవరాయలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి) వినుకొండ నుంచి గుంటూరు రహదారిని విస్తరించేందుకు కేంద్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఉన్న రహదారిని నాలుగు వరుసలుగా విస్తరిస్తారు. సూమారు 90 కిలో మీటర్లు పొడవునా రహదారిని విస్తరించేందుకు రూ 2,360 కోట్లు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. జిల్లాలో ఇది కీలకమైన ప్రాజెక్టు. వినుకొండ నుంచి నరసరావుపేట మీదుగా ఈ రహదారిని విస్తరిస్తారు. రహదారి విస్తరణకు కొన్ని ప్రాంతాల్లో భూసేకరణ చేయాల్సి ఉందని సంబంధిత అధికారులు తెలిపారు. భూసేకరణతో పాటు రహదారి పనుల ప్రక్రియను ప్రారంభించేందుకు అధికారులు సమాయత్తమవుతున్నారు.

కొండమోడు - పేరేచర్ల జాతీయ రహదారి విస్తరణకు రూ. 881.61 కోట్లు మంజూరు చేసింది. ఈ రహదారిని కేంద్రం ప్రభుత్వంలోని భారత మాల ప్రాజెక్టు కింద నిధులు మంజూరు చేశారు. ఈ రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఎన్నో ఏళ్ళుగా ఈ ప్రాంత ప్రజలు కోరుకుంటున్నారు. 49.917 కిలోమీటర్లు నాలుగు లైన్ల రహదారిని నిర్మిస్తారు. ఈ రహదారికి సత్తెనపల్లి, మేడికొండూరులలో బైపాస్ రహదారులు ఏర్పాటు చేస్తారు. పనులకు సంబంధించి టెండర్లు ప్రక్రియ కూడా పూర్తయింది. విస్తరణ కోసం భూసేకరణ దాదాపు పూర్తయింది. పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి.

మాచర్ల నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేసింది. నాలుగు రహదారులను విస్తరణకు రూ 117.75 కోట్లు నిధులు మంజూరు చేసింది. దుర్గి నుంచి వెల్దుర్తి వరకు 17.6 కిలోమీటర్ల మేర రహదారిని విస్తరిస్తారు. ఈ రహదారి నిర్మాణానికి రూ.31.60కోట్లు మంజూరయ్యాయి. 8/6 కిలో మీటరు వద్ద వాగుపై బ్రిడ్జి నిర్మిస్తారు. రెంటచింతల మండలంలోని పాలువాయి జంక్షన్ నుంచి పసర్లపాడు, జెట్టిపాలెం మీదుగా సత్రశాల వరకు 11.2 కిలోమీటర్ల పొడవున రహదారిని పటిష్ఠ పరిచి విస్తరిస్తారు. ఈ రహదారిలో 2/4 కిలో మీటరు వద్ద వాగుపై బ్రిడ్జి నిర్మాణం కూడా మంజూరైంది. ఇందుకు రూ 21.65 కోట్లు నిధులు మంజూరు చేశారు. మాచర్ల నుంచి విజయపురి సౌత్ వరకు 22.8 కిలోమీటర్ల రహదారి విస్తరణకు రూ 31 కోట్లు, లోయపల్లి నుంచి గొట్టిపాళ్ల, కంఢ్లకుంట, గుడిపాటి చెరువు మీదుగా లచ్చంబావి తండా వరకు 25.40 కిలోమీటర్ల రహదారి విస్తరణకు రూ 33.50 కోట్లు నిధులు మంజూరయ్యాయి. కేంద్ర రహదారి మౌలిక సదుపాయల పథకం కింద నిధులు మంజూరయ్యాయి. ఈ ఆర్థిక సంవత్సరంలోనే రహదారుల నిర్మాణాన్ని చేపట్టనున్నారు.

సత్తెనపల్లి, గురజాల ప్రాంతాల్లో రైల్వే ట్రాక్‌లపై బ్రిడ్జిల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం అంగీకారం తెలిసింది. సత్తెనపల్లి రెడ్డిగూడెం వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి మంజూరైంది. ఇందుకు రూ 57.13కోట్లు నిధులు మంజూరు చేసంది. గురజాల నియోజవర్గంలోని తుమ్మలచెరువు - నడికూడి స్టేషన్‌ల మధ్య రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి రూ 70.49 కోట్లు మంజూరయ్యాయి. ఈ పనులకు సంబంధించి భూసేకరణ వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది. టెండర్లు నిర్వహించే దిశగా ఏర్పాట్లు చేస్తున్నారు.

# అటు వెలవెల.. ఇటు కళకళ

- మాచర్ల మందుబాబుల్లో హర్షాతిరేకాలు
- తెలంగాణకు వెళ్లే బాధ తప్పిందని సంబరం
- బోసిపోయిన సరిహద్దులోని మద్యం దుకాణాలు

మాచర్లటౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నుంచి ప్రైవేటు వ్యక్తుల చేతిలోకి మద్యం వ్యాపారం వచ్చింది. ఏపీలో ప్రైవేటు మద్యం షాపులు ప్రారంభం కావడంతో సరిహద్దు ప్రాంతమైన తెలంగాణ లోని పైలాన్ కాలనీ, హిల్ కాలనీలోని మద్యం దుకాణాలు గురువారం బోసిపోయాయి. గత వైసీపీ ప్రభుత్వం తెచ్చిన నాసిరకం మద్యం తాగలేక మందుబాబులు మద్యం కోసం సమీపంలోని తెలంగాణ ప్రాంతానికి వెళ్లేవారు. దీంతో సరిహద్దులోని తెలంగాణ మద్యం దుకాణాలు నిత్యం రద్దీగా మారాయి. మాచర్ల ప్రాంతంలో మద్యం తాగాలంటే మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి బార్లకు వెళ్లి జేబులు గుల్ల చేసుకోవాల్సిన పరిస్థితి ఉండేది. ఎవరైనా అరకొరగా మద్యం బాటిళ్లను తెలంగాణ నుంచి తెచ్చుకుంటే పోలీసులతో పట్టించి జైలుకు పంపించేవాళ్లు. కూటమి ప్రభుత్వంలో ఇప్పుడు మరలా పాత బ్రాండ్లు అందుబాటులోకి రావడంతో సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది. తెలంగాణ ప్రాంతానికి వెళ్లి మద్యం తాగాల్సిన అవస్థలు ఇక తప్పాయని, స్థానికంగానే అన్ని బ్రాండ్లు అందుబాటులోకి వచ్చాయని మందుబాబులు సంబరపడుతున్నారు.



వెలవెలపోతున్న తెలంగాణలోని మద్యం దుకాణం



కొనుగోలుదారులతో కళకళలాడుతున్న మాచర్లలోని మద్యం దుకాణం

● రూ.17.69 కోట్లు మంజూరు

# కాలువల మరమ్మతులకు నిధులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి) నాగార్జున సాగర్ కుడి కాలువ పరిధిలో అధ్వానంగా ఉన్న కాలువల బాగుకు వైసీపీ ప్రభుత్వం స్పందించలేదు. ఐదేళ్లు నిధులు విడుదల చేయకుండా కాలువలను పాడుబెట్టింది. కాలువలు రూపురేఖలు కోల్పోయి నీరు పారుదలకు ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయి. ఐదేళ్ల నిర్లక్ష్యం.. సాగు నీటి వ్యవస్థ నిర్వీర్యం అనే శీర్షికతో కాలువల అధ్వానస్థితిపై, ఆంధ్రజ్యోతిలో వెలువడిన కథనంపై అధికారులు స్పందించారు.

మేజర్లు, మైనర్‌లు, సబ్‌మైనర్ కాలువలు శిథిలావస్థకు చేరుకున్నాయి. సాగునీటి సరఫరాకు ఇబ్బందులు తలెత్తనున్నాయి. కాలువల్లో కంప చెట్లు పెద్ద ఎత్తున పెరిగాయి. జమ్ము, తూటుకాడ, రబ్బరు మొక్కలు కాలువల నిండా అల్లుకుపోయాయి. ఇవి నీటి సరఫరాకు అవరోధంగా మారనున్నాయి. తక్షణావసరమైన పనులు చేపట్టాలని ప్రభుత్వం జలవనరుల శాఖ అధికారులకు సూచించింది. ఈ మేరకు పనులను గుర్తించారు. పనులకు సంబంధించిన అంచనాలను రూపొందించారు. సాగర్ లింగంగుంట్ల సర్కిల్ పరిధిలో 292 పనులను గుర్తించారు. ఈ పనులు చేపట్టేందుకు రూ 17.69 కోట్లు వ్యయం అంచనా వేశారు.

అధికారుల సూచనలతో కూటమి ప్రభుత్వం స్పందించింది. కాలువల మరమ్మతులకు నిధులు మంజూరు చేసింది. రూ 17.68 కోట్లు మంజూరు కావడంతో అత్యవసర పనులను చేపట్టేందుకు జలవనరుల శాఖ సమాయత్తమైంది. కాలువల మరమ్మతులకు ప్రభుత్వం నిధులు ఇవ్వడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



గోవిందాపురం కాలువలో పెరిగిన కంప చెట్లు



పెదనందిపాడు బ్రాంచ్ కెనాల్‌లో పెరిగిన కంప చెట్లు

### గుర్తించిన పనులు ఇవీ..

లింగంగుంట్ల ఓఅండ్ఎం డివిజన్ పరిధిలో 76 పనులు ఇందుకు వ్యయం అంచనా రూ. 4.21 కోట్లు. మాచర్ల ఓఅండ్ఎం డివిజన్ పరిధిలో 101 పనులు వ్యయం అంచనా రూ. 4.69 కోట్లు. ఓఅండ్ఎం డివిజన్ సత్తెనపల్లి పరిధిలో 50 పనులు వ్యయం అంచనా రూ 3.34 కోట్లు. లింగంగుంట్ల మానిటరింగ్ డివిజన్ పరిధిలో 31 పనులు వ్యయం అంచనా రూ. 3.65 కోట్లు. ఓఅండ్ఎం సిఫ్ట్ డివిజన్ వినుకొండ పరిధిలో 34 పనులు వ్యయం అంచనా రూ 1.78 కోట్లు. ఈ పనులు చేపట్టేందుకు జలవనరుల శాఖ ఏర్పాట్లు చేస్తోంది. పనుల నిర్వహణకు టెండర్లు పిలవనున్నది. కాలువల్లో నీటి సరఫరా జరగుతోంది. సరఫరాకు ఆటంకం లేకుండా పనులు నిర్వహిస్తారు. కాలువల్లో నీరు పారుతున్నా ఈ పనులు చేపట్టవచ్చని అధికారులు చెబుతున్నారు.


## అమరావతిలో నేషనల్ గేమ్స్‌కు కృషి

- మంగళగిరిస్టేడియంలో స్పోర్ట్స్ సిటీ ఏర్పాటు
- సౌత్ జోన్ జూనియర్ అథ్లెటిక్స్ మీట్‌లో ఎంపీ కేశినాని



పోటీలో తలపడుతున్న క్రీడాకారిణులు

8



విద్యార్థిని తేజస్వినిని అభినందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

## సీఎంఏ టాపర్‌కు సీఎం అభినందన

- సీఎం రిలీఫ్ ఫండ్‌కు

**మాస్టర్‌మైండ్స్ రూ. 7 లక్షల విరాళం**

గుంటూరు(విద్య),అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ప్రకటించిన సీఎంఏ ఫలితాల్లో జాతీయ స్థాయిలో మొదటి ర్యాంకు సాధించిన మాస్టర్‌మైండ్స్ విద్యార్థిని కొత్తపేట తేజస్వినిని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభినందించారు. వెలగపూడిలోని సచివాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో మాస్టర్‌మైండ్స్ అడ్మిన్ అడ్వైజర్ మట్టుపల్లి మోహన్, విద్యార్థిని తండ్రి తదితరులు పాల్గొన్నారు. ప్రతిభావంతులైన విద్యార్థులను మాస్టర్‌మైండ్స్ సంస్థ తీర్చిదిద్దడం అభినందనీయమని చంద్రబాబు అన్నారు. ఇటీవల సంభవించిన వరదలకు నష్టపోయిన వారిని ఆదుకునేందుకు మాస్టర్‌మైండ్స్ తరపున సీఎం సహాయనిధికి రూ.7 లక్షలు డీడీని డైరెక్టర్ మోహన్ అందించారు.



## నిజాంపట్నం హార్బర్‌లో 3వనెంబర్ ప్రమాద సూచిక

- మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలి

రేపల్లె, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో కొనసాగుతున్న వాయుగుండం కారణంగా నిజాంపట్నం హార్బర్‌లో 3వ నెంబర్ ప్రమాద సూచిక ఎగురవేశారని పోర్టు కన్జర్వేటర్ మోకా వెంకటరామారావు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ సముద్రంలో వేటకు వెళ్ళిన మత్స్యకారులు తిరిగి రావాలని, ఎవరూ వేటకు వెళ్లొద్దని సూచించారు.

# అడ్డగోలుగా ఇసుక తవ్వకాలు

- ముఖ్యమంత్రి ప్రకటనను తప్పుదారి పట్టిస్తున్న వైనం
- రెచ్చిపోతున్న అక్రమార్కులు
- పెసర్లంక, గాజుల్లంక వద్ద కృష్ణా నదిలో ఇసుకను ట్రాక్టర్ల ద్వారా తెనాలి, చెరుకుపల్లికి తరలింపు
- పోలీసుల తీరుపై విమర్శలు

కొల్లూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : సొంత అవసరాలకు ఇసుక ఉచితంగా తీసుకు వెళ్లవచ్చునని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించడంతో అక్రమార్కులు రెచ్చిపోయారు. ఒక్కసారిగా పదులకు పైగా సంఖ్యలో ట్రాక్టర్లను కృష్ణానదిలో ఇసుక నింపుకుని రవాణా చేస్తూ విక్రయాలకు తెరలేపారు. గురువారం కొల్లూరు మండల పరిధిలోని పెసర్లంక, గాజుల్లంక వద్ద కృష్ణానదిలో ట్రాక్టర్ల ద్వారా ఇసుక నింపుకుని తెనాలి, చెరుకుపల్లి తదితర ప్రాంతాలకు తరలించి వాహనదారులు సొమ్ము చేసుకునేందుకు ఉపక్రమించారు.

అయితే, వాగులు, వం కల్లో మాత్రమే ఉచితంగా సొంత అవసరాలకు ఇసుక తరలించుకోవచ్చని నదుల్లో మాత్రం నిబంధనలు వర్తిస్తాయని స్పష్టంగా పేర్కొన్నప్పటికీ వాటిని పట్టించుకోకుండా కేవలం ఉచిత ఇసుక నినాదాన్ని వినిపిస్తూ అక్రమంగా ఇసుక తవ్వకాలు చేసి సొమ్ము చేసుకునేందుకు అక్రమార్కులు ముఖ్యమంత్రి ప్రకటనను తప్పుదారి పట్టిస్తున్నారు. పోలీసులు సైతం ఇసుక వాహనాలను అడ్డుకోమని ముందస్తుగా చెప్పడంతో మరింత రెచ్చిపోయి పెసర్లంక, గాజుల్లంక రేవుల్లో ఎక్కడబడితే అక్కడ ఇసుక తవ్వకాలు సాగించారు . మధ్యాహ్న సమయానికి పోలీసుల్లో కదలిక రావడంతో ఒక్కసారిగా రేవుల వద్దకు వెళ్లి ఇసుక రవాణా చేయవద్దంటూ వాహనదారులకు చెప్పారు. దీంతో పోలీసులకు వాహనదారులకు వాగ్వావాదం చోటు చేసుకుంది. దీంతో నిబంధనలను వివరించి ఇందుకు విరుద్ధంగా ఇసుక రవాణా జరగకూడదని పైనుంచి ఉత్తర్వులు వచ్చాయని వాహనదారులకు తెలిపారు. అయితే, నిత్యం ట్రాక్టర్లు, లారీల ద్వారా ఇసుక రవాణా జరుగుతుంటే అప్పుడు నిబంధనలు గుర్తుకు రాలేదా అంటూ ప్రశ్నల వర్షం కురిపిస్తూ, పోలీసుల తీరును విమర్శించారు.



పెసర్లంక అరవింద వారధి వద్ద కృష్ణానదిలో ఇసుక నింపుకుంటున్న ట్రాక్టర్లు (ఫైల్)

### దళారుల కనుసన్నల్లో ఇసుక రవాణా ..

ఉచిత ఇసుక విధానం అమలులోకి వచ్చినప్పటి నుంచి నిబంధనలకు విరుద్ధంగా కొందరు అక్రమార్కులు అక్రమ ఇసుక తవ్వకాలు చేస్తూ ఇసుక రవాణాకు పాల్పడి సొమ్ము చేసుకుంటున్నారు. ఇందుకు పోలీసులు సహకారం కూడా ఉందనే విమర్శలు బాహాటంగా వినిపిస్తున్నాయి. పైగా పోలీసులే ఓ దళారీ వ్యవస్థను ఏర్పాటు చేసుకుని ఇసుక దందా సాగిస్తున్నట్లుగా సమాచారం. లంక గ్రామాల్లో కొంత మంది ట్రాక్టర్లు, లారీల ద్వారా ఇసుక రవాణా చేస్తున్న విషయం పోలీసులకు తెలిసినప్పటికీ వాటిని నిలువరించే ప్రయత్నాలు చేయడం లేదని, ఇందుకు వారి నుండి భారీగా ముడుపులు అందుతున్నాయనే ఆరోపణలు లేకపోలేదు. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడి పట్టుబడిన వాహనాలు స్టేషన్‌కు తీసుకువచ్చినప్పటికీ అక్కడ అందే ముడుపుల ప్రకారం తహసీల్దార్, కోర్టులకు అప్పగిస్తున్నారని వాహనదారులు విమర్శిస్తున్నారు. అధికార పార్టీకి చెందిన చిన్నపాటి నాయకులు కూడా ఇసుక దందా చేస్తూ పోలీసులకు ముడుపులు అందిస్తూ, తమ వాహనాలను అడ్డుకోకుండా చేసుకుంటున్నారని, ఇతరుల వాహనాలు ఇసుక రవాణా చేస్తుంటే వాటి గురించి పోలీసులకు సమాచారం ఇచ్చి పట్టిస్తున్నారనేది బహిరంగ రహస్యమని బాధిత వాహనదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఇసుక అక్రమ రవాణా నిలువరించి, ఉచిత ఇసుక పాలసీ సజావుగా సాగేలా చూడాలని వాహనదారులు కోరుతున్నారు.

## సమస్యలను త్వరితగతిన పరిష్కరించండి

- 'ప్రజాదర్బార్'లో వినతులు స్వీకరించిన మంత్రి లోకేశ్



వినతిపత్రం స్వీకరిస్తున్న మంత్రి నారా లోకేశ్

తాడేపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసం వినూత్నంగా నిర్వహిస్తున్న ప్రజా దర్బార్‌కు అనూహ్య స్పందన లభిస్తోంది. ప్రజాదర్బార్‌కు వచ్చే సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ సిబ్బందిని ఆదేశించారు. ఆయా సమస్యలను సంబంధిత శాఖలకు పంపడంతో పాటు పరిష్కారమయ్యే వరకూ నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. గురువారం 43వ రోజు ఉండవల్లి ప్రజా దర్బార్‌లో పలు విజ్ఞప్తులు వచ్చాయి.

- మంగళగిరి నియోజకవర్గ విజ్ఞప్తులు

కారుడ్రైవర్‌గా పనిచేస్తున్న తన ఏకైక కుమారుడిని తోటి డ్రైవర్లు కలిసి హత్య చేశారని, విచారించి నిందితులను శిక్షించాలని ఉండవల్లికి చెందిన ఏపూరి వెంకట రమణ విజ్ఞప్తి చేశారు. కుటుంబానికి ఆధారమైన కుమారుడిని కోల్పోవడంతో అనారోగ్యానికి గురయ్యానని, పెన్షన్ మంజూరు చేసి ఆదుకోవాలని కోరారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటానని మంత్రి హామీ ఇచ్చారు. అనారోగ్యంతో భర్త మరణించడంతో తన ఇద్దరి పిల్లల పోషణ భారంగా మారిందని ఇల్లు మంజూరు చేయడంతోపాటు స్వయం ఉపాధి కల్పించి ఆదుకోవాలని నులకపేటకు చెందిన కొండ సుశీల కోరారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటానని మంత్రి హామీ ఇచ్చారు. ప్రజారాజధాని అమరావతి నిర్మాణానికి ల్యాండ్ పూలింగ్ కింద సేకరించిన తమ భూమికి వార్షిక కౌలు అందడం లేదని, విచారించి కౌలు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని నిడమర్రుకు చెందిన చల్లా పెద్ద అంకమ్మరావు విజ్ఞప్తి చేశారు. పరిశీలించి కౌలు అందేలా చూస్తానని మంత్రి భరోసా ఇచ్చారు. బి.కామ్ కంప్యూటర్స్ చదివిన తనకు ఎయిమ్స్‌లో ఉద్యోగ అవకాశం కల్పించాలని మంగళగిరికి చెందిన షేక్ మహమ్మద్ రఫి కోరారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటానని మంత్రి హామీ ఇచ్చారు.

## చింతలపూడి సచివాలయాన్ని సందర్శించిన ముఖ్యకార్యదర్శి మనోజ్ జోషి

- భూ రీ-సర్వేను ఫొటో ప్రదర్శనతో వివరించిన అధికారులు

దుగ్గిరాల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ, కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ, భూవనరుల విభాగం ముఖ్యకార్యదర్శి మనోజ్ జోషి మండలం చింతలపూడిని గురువారం సందర్శించారు. తొలుత సచివాలయంలో నిర్వహించే రీ-సర్వే, ఇతర విధులకు సంబంధించి రికార్డులను పరిశీలించారు. రాష్ట్ర సర్వే, భూమి రికార్డుల సర్వే డైరెక్టర్ శ్రీకేశ్ లత్కర్, గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి సందర్శించారు. రీ-సర్వేకు సంబంధించి వివిధ ప్రక్రియల వివరాలు తెలియజేసే ఫొటోప్రదర్శనను పరిశీలించారు. గ్రామంలో భూరికార్డుల స్వచ్ఛీకరణ, ప్రీడ్రోన్ ఫ్లైయింగ్, డ్రోన్‌ఫ్లై ఫ్లైయింగ్, గ్రౌండ్ ట్రూతింగ్, గ్రౌండ్ వాలిడేషన్, రికార్డు అసిస్టేషన్, బౌండరీల నిర్ధారణ, అప్పీళ్ల పరిష్కారం, భూయజమానుల తుది వివరాల ప్రచురణ, తదితర ప్రక్రియల గురించి ఫొటోప్రదర్శన ద్వారా కలెక్టర్, జేసీ ఏ.భార్గవ్‌తేజలు వివరించారు. సర్వేకు ముందున్న ఆర్ఎస్ఆర్ భూరికార్డులు, గ్రామపటం, రీ-సర్వే, తద్వారా ఎల్‌బీఎం రికార్డులు తుదివివరాల గ్రామపటం, రీ-సర్వేకు వినియోగించిన పరికరాల ప్రదర్శనను మనోజ్‌జోషి తిలకించారు. అనంతరం ప్రియదర్శిని ఇంజనీరింగ్‌కళాశాలలో రైతులతో జరిగిన సమావేశంలో సమావేశమై రీ-సర్వేకు సంబంధించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. గతంలో రికార్డుల ప్రకారం ఉన్న విస్తీర్ణం 2 నుంచి 5 సెంట్ల వరకూ తగ్గిందని, మరికొందరు రైతులు పూర్తిస్థాయిలో తమకు భూ రికార్డులు అందాయని, వాటిని రికార్డుల్లో నమోదు చేసినట్లు తెలిపారు. కలెక్టర్ మాట్లా డుతూ, కేంద్ర ప్రభుత్వం డీఐ ఎల్ఆర్ ప్రాజెక్టులో భాగంగా రాష్ట్రంలో జరిగిన రీ-సర్వేను పరిశీలనకు కేంద్ర, రాష్ట్ర మంత్రిత్వ శాఖలు వచ్చాయని, భూ యజమానుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారని చెప్పారు. రీ-సర్వే అనంతరం తమకు న్యాయం జరిగిందని 20నుంచి 30 మంది రైతులు చెప్పారు.. హద్దులు పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయడం వలన వివాదాలకు తావులేకుండా పోయిందని వివ రించారు. రాష్ట్ర సర్వేల్యాండ్ రికార్డ్ డిప్యూటీ డైరెక్టర్లు గోవిందరావు, కెజియాకుమారి, సీజీవీఎస్ కుమార్, జిల్లా పరిషత్ సీఈఓ జ్యోతిబసు, సర్వే ఏడీ పవన్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే, పార్థసారథి, గోవిందరావు, తెనాలి సబ్‌కలెక్టర్ సంజనా సిన్హా, తహసీల్దార్ ఐ.సునీత, సర్పంచ్ తాడిబోయిన రామకృష్ణ, కార్యదర్శి మణికంఠ తదితరులు పాల్గొన్నారు.



ఫొటో ప్రదర్శనను తిలకిస్తున్న మనోజ్‌జోషికి వివరిస్తున్న రాష్ట్ర భూ రికార్డు సర్వే డైరెక్టర్ శ్రీకేశ్‌లత్కర్, చిత్రంలో కలెక్టర్ తదితరులు

## సజ్జలను ఈడ్చుకొచ్చి జైల్లో పడేయండి

- ఎమ్మెల్యే ఆనందబాబు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనందబాబు

వేమూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : పోలీసు విచారణకు సహకరించకపోగా కూటమి ప్రభుత్వాన్ని, చంద్రబాబు విధానాన్ని విమర్శించ డం, హద్దులు మీరి మాట్లాడటం సజ్జల రామకృష్ణారెడ్డికి తగదని, అలాంటి వ్యక్తిపై కేసు పెట్టి నోటీసులు ఇచ్చే విధానం కాకుండా, ఈడ్చుకొచ్చి జైలులో పడేయాలని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. వేమూరులో విలేకరుల సమావేశంలో గురువారం ఆయన మాట్లాడుతూ, చంద్రబాబునాయుడు ప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నారు కనుకనే, ప్రతి విషయాన్ని పారదర్శకంగా ముందుకు తీసుకు వెళుతున్నారని అన్నారు. ప్రభుత్వం హద్దులు మీరుతోందని అనడంతో పాటు నోటికి వచ్చినట్లుగా చంద్రబాబుపై మాట్లాడుతున్న సజ్జల తీరుపై సామరస్యం పనికి రాదని, అలాంటి వ్యక్తి తీరును ఇప్పటికే ప్రజలు చీదరించుకుంటున్నారని, ఆయనపై ప్రభుత్వం కూడా కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటికైనా సజ్జల తన నోటిని అదుపులో ఉంచుకోని పక్షంలో చట్టపరంగా కఠినమైన శిక్ష అనుభవించాల్సి వస్తుందని హెచ్చరించారు. సమావేశంలో బాపట్ల పార్లమెంటరీ స్థాయి టీడీపీ అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు పాల్గొన్నారు.

## డివిజన్ పరస్పర మార్పిడి వద్ద తగ్గనున్న సమయం

- పగిడిపల్లి - బొమ్మాయిపల్లి మధ్య రెండు వరుసల రైలుమార్గం
- రూ. 40.18 కోట్లకు టెండర్ పిలిచిన రైల్వే శాఖ
- ఏడాదిలోగా పూర్తి చేసేందుకు గడువు విధింపు

గుంటూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గుంటూరు, సికింద్రాబాద్ రైల్వే డివిజన్ల మధ్యన రైళ్ల పరస్పర మార్పిడి జరిగే పగిడిపల్లి జంక్షన్ వద్ద ఏడాది వ్యవధిలోనే రెండు వరుసల రైలుమార్గం నిర్మాణం జరగనుంది. గుంటూరు - బీబీనగర్ రైల్వే డబ్లింగ్ ప్రాజెక్టులో భాగంగా ఈ పనిని చేపట్టనున్నారు. పగిడిపల్లి - బొమ్మాయిపల్లి మధ్యన సింగిల్ లేన్ కారణంగా దెబ్బతింటున్న రైళ్ల సమయపాలన ఈ పని పూర్తితో పరిష్కారం కానుంది. రెండు వరుసల రైలు మార్గంతో ఇక ఇక్కడ రైళ్లు నిలుపుదల చేయకుండా డివిజన్ ఎక్స్ఛేంజ్‌ని సులభతరంగా చేయొచ్చు. ఇందుకోసం రైల్వే శాఖ తాజాగా టెండర్ నోటిఫికేషన్‌ని విడుదల చేసింది. గుంటూరు - సికింద్రాబాద్ రైలు మార్గంలో పగిడిపల్లి జంక్షన్ వద్ద డివిజన్ పరస్పర మార్పిడి రైళ్ల రాకపోకలకు పెద్ద అడ్డంకిగా మారింది. పగిడిపల్లి నుంచి గుంటూరు వైపునకు సింగిల్ లేన్ ఉండటం వలన ఏదైనా రైలుని సికింద్రాబాద్ వైపు నుంచి ఈ మార్గంలోకి తీసుకోవాలంటే ఎదురొచ్చే రైలుని బొమ్మాయిపల్లి వద్ద నిలిపేయాల్సిన పరిస్థితి. ఒకవేళ గుంటూరు వైపు నుంచి సికింద్రాబాద్ వైపునకు వచ్చే రైలు బొమ్మాయిపల్లి దాటి ముందుకొస్తే సికింద్రాబాద్ నుంచి గుంటూరు వైపు వెళ్లే రైలుని పగిడిపల్లిలో నిలిపేయాల్సి వస్తోంది. దీని వలన ఒక్కోసారి పావుగంట నుంచి అరగంట పాటు పగిడిపల్లి డివిజన్ ఇంటర్ చేంజ్ వద్ద నిలిపేస్తున్నారు. అక్కడి వరకు నిర్దేశిత సమయానికి రైళ్లు వెళుతున్నా ఆ తర్వాత సికింద్రాబాద్ చేరుకోవడానికి కనీసం అరగంట నుంచి గంటకు పైగా జాప్యం జరుగుతోంది. వీటన్నింటికి పరిష్కారమార్గంగా పగిడిపల్లి - బొమ్మాయిపల్లి మధ్యన రెండు వరుసల మార్గం నిర్మించాలని రైల్వే శాఖ నిర్ణయించింది. ఈ పని కోసం టెండర్ నోటిఫికేషన్‌ని అప్‌లోడింగ్ చేసింది. ఈ నెల 24వ తేదీ నుంచి బిడ్డింగ్ ప్రారంభమై నవంబరు 7తో ముగుస్తుంది. మట్టిపని, మైనర్ బ్రిడ్జిలు, ఆర్‌యూబీల విస్తరణ, ప్లాట్‌ఫాంలు, సర్వీసు భవనాలు, ఫుట్ ఓవర్ బ్రిడ్జి, కవర్ ఓవర్ ప్లాట్‌ఫాంలు, ఎంఎస్‌ఈ గోడల నిర్మాణాలు, గులకరాళ్ల సేకరణ, డంపింగ్, పాత్ వే మెటీరియల్స్ సరఫరా, ట్రాక్ నిర్మాణం, లింకింగ్, పాయింట్ల అసెంబ్లీ, ఇన్‌సర్షన్, క్రాసింగ్‌లు, విద్యుద్దీకరణ, సిగ్నలింగ్ పనులన్నింటిని కలిపి రూ. 40 కోట్ల 18 లక్షల 18 వేల 35గా అంచనా వ్యయాన్ని నిర్ణయించింది. బిడ్డింగ్‌లో ఎవరు తక్కువకి కోట్ చేస్తే ఆ ఏజెన్సీకి పనిని కేటాయిస్తారు. ఎంవోయూ జరిగిన 12 నెలల్లోనే ఈ పనిని పూర్తి చేయాలన్న నిబంధనని కూడా చేర్చింది. దీని దృష్ట్యా వచ్చే ఏడాది ఆఖరుకు పగిడిపల్లి - బొమ్మాయిపల్లి డబ్లింగ్ పూర్తి అయి డివిజన్ ఇంటర్‌చేంజ్ సమస్యలు పరిష్కారమౌతాయని రైల్వే వర్గాలు ఆశాభావం వ్యక్తం చేశాయి.

### నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.05
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

### బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

| | |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 135, 145,155 |
| చికెన్ విత్ స్కిన్ | 260.00 |
| చికెన్ స్కిన్ లెస్ | 270.00 |

# చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రావీణ్యం సాధించాలి

- గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్
- అంతర జిల్లాల జిమ్నాస్టిక్స్ చాంపియన్ షిప్ -24 ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే నసీర్

గుంటూరు(తూర్పు), అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): చదువుతో పాటు క్రీడలలో ప్రావీణ్యం సాధించాలని తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. జిమ్నాస్టిక్స్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వ ర్యంలో సబ్ జూని యర్, జూనియర్, సీనియర్ విభాగాల్లో స్థానిక బీ ఆర్ స్టేడియంలో మూడు రోజుల పాటు జరిగే జిమ్నాస్టిక్స్ చాంపియన్ షిప్ -24 పోటీలను గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం నసీర్ మాట్లాడుతూ క్రీడాకారుల ఫిట్నెస్ కోసం శిక్షణ శిబిరాల్ని ఏర్పాటు చేస్తున్నట్టు వివరించారు. బీఆర్ స్టేడియంను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే జిమ్నాస్టిక్స్ పరికరాల కోసం ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు సాయంతో రూ.35లక్షలు కేటాయించినట్టు తెలిపారు. అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.సుబ్బారావు మాట్లాడుతూ మూడు రోజులు పాటు జరిగే పోటీలో 250 మంది క్రీడాకారులు హాజరైనట్టు తెలిపారు. గెలిచిన వారు గుజరాత్‌లో జరిగే జాతీయ పోటీలలో పాల్గొంటారని అన్నారు. చీఫ్ కోచ్ నరసింహారెడ్డి, జిమ్నాస్టిక్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు విఠల్, ఒలింపిక్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శి చల్లా వెంకటేశ్వరరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, డబుల్స్ హార్స్ ఛైర్మన్ మోహన్ శ్యామ్ ప్రసాదు, రెడ్‌క్రాస్ సభ్యులు వడ్లమాని రవి పాల్గొన్నారు.

## ప్రకాశం బ్యారేజి వద్ద పెరుగుతున్న వరద ఉధృతి

తాడేపల్లి టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎగువన ప్రాజెక్టుల నుండి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద వరద ఉధృతి పెరుగు తోంది. ఎగువన ఉన్న పులి చింతల ప్రాజెక్టు ప్రధాన వాగుల నుండి 61 వేల 072 క్యూసెక్కుల వరద నీరు గురువారం ప్రకాశం బ్యారేజి వద్దకు చేరుతున్నట్టు నీటి పారుదల శాఖ జేఈ రాజేష్ తెలిపారు. బ్యారేజి రిజ ర్వాయర్‌లో 12 అడుగుల నీటి మట్టం కొనసాగుతుండగా 60 గేట్లను 1 అడుగు, 10 గేట్లను 2 అడుగుల మేర ఎత్తి దిగువకు 57 వేల 500 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తు న్నారు. అలాగే తూర్పు డెల్టా కాలువకు 3 వేల 056 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టా కాలువకు 516 క్యూసెక్కుల నీటిని వదులు తున్నట్టు జేఈ తెలిపారు. దిగువ నది ప్రాంతాల వారు అప్రమత్తంగా ఉండాలని అధి కారులు సూచించారు.

## డీఎస్సీ శిక్షణకు కోచింగ్ సెంటర్ల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు(విద్య),అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో సాంఘిక సంక్షేమ,గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు డీఎస్సీ శిక్షణ కోసం అర్హులైన కోచింగ్ సెంటర్లనుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ డి.మధుసూధనరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డి ఎస్సీ శిక్షణ కోసం ఆసక్తి ఉన్న సంస్థలు ఈ నెల 21 లోగా https://tender. apeprocurement.gov.in అనే వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు గతంలో కోచింగ్ ఇచ్చిన అనుభవం, ఇక్కడ శిక్షణ పొందిన వారిలో కనీసం 100 మంది ఉపాధ్యాయులుగా ఉద్యోగాలు పొంది ఉండాలని స్పష్టం చేశారు.

## డిగ్రీ 5, 6వ సెమిస్టర్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

పెదకాకాని, అక్టోబర్ 17 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఆగస్టులో నిర్వహించిన డిగ్రీ 5వ, 6వ సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలను ఇన్‌చార్జి వీసీ ఆచార్య కే. గంగాధర రావు గురువారం విడుదల చేశారు. బీకాం, బీఏ, బీఎస్సీ, బీసీఏ, బీబీఏ, బీఏ ఓఎల్ కోర్సులకు సంబంధించి ఫలితాలు వెల్లడించినట్లు పేర్కొన్నారు. 5వ సెమిస్టర్‌లో 5973 మంది విద్యార్థులకు 4095 మంది 6వ సెమిస్టర్ లో 300 మందికి 202 మంది ఉత్తీర్ణులైనట్లు పేర్కొన్నారు. ఫలితాలను విశ్వవిద్యాలయం వెబ్‌సైట్ డబ్ల్యూ డబ్ల్యూ డబ్ల్యూ. ఏఎన్‌యూ ఏసి. ఇన్ లో పొందుపరిచినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పరీక్షల నియంత్రణ అధికారి ఏ.శివప్రసాదరావు మాట్లాడుతూ ఫలితాలకు సంబంధించి విద్యార్థులకు సందేహాలు ఉంటే రివాల్యుయేషన్ చేసుకోవచ్చని సూచించారు. నవంబర్ 2లోగా రీవాల్యుయేషన్, జవాబు పత్రాన్ని పర్సనల్ వెరిఫికేషన్ చేసుకునేందుకు ఆఖరి తేదీగా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. పర్సనల్ వెరిఫికేషన్, రివాల్యుయేషన్ ఒక్కొక్క పేపర్ కు రూ .1490 ఫీజు చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఫలితాల విడుదల కార్యక్రమంలో తాత్కాలిక రెక్టార్ ఆచార్య కె. రత్నషీలామణి, తాత్కాలిక రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం, డిగ్రీ పరీక్షల తాత్కాలిక కోఆర్డినేటర్ ఆచార్య ఎన్. వి.కృష్ణారావు, రీసెర్చ్ సెల్ తాత్కాలిక కోఆర్డినేటర్ డాక్టర్ పి. సుధాకర్, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.సిద్దయ్య, పరీక్షల నోడల్ ఆఫీసర్ రెడ్డి ప్రకాష్ రావు, వై. రాధాకృష్ణ పాల్గొన్నారు.

## పవర్ లిఫ్టింగ్‌లో జ్యోతి వర్మకు కాంస్యం



మంగళగిరి సిటీ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గోవాలో జరుగుతున్న జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్‌లో గుంటూరుకు చెందిన మహిళా పవర్ లిఫ్టర్ పీ.జ్యోతి వర్మ కాంస్య పతకం సాధించారు. మాస్టర్స్-2 69 కిలోల బెంచిప్రెస్ విభాగంలో జ్యోతి వర్మ తృతీయ స్థానంలో నిలిచి కాంస్య పతకం సొంతం చేసుకున్నారు. జాతీయ స్థాయి మాస్టర్స్ విభాగంలో గుంటూరు జిల్లా నుంచి ఈ ఘనత సాధించిన తొలి మహిళా లిఫ్టర్‌గా ఆమె నిలిచారు. పవర్ లిఫ్టింగ్ అసో సియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గంటా వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి సకల సూర్య నారాయణ, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొమ్మాకుల విజయ భాస్కరరావు, షేక్ సందాని తదితరులు జ్యోతి వర్మకు అభినందనలు తెలిపారు.

## రోడ్డు ప్రమాదం కేసులో రెండేళ్ల జైలు

గుంటూరు(లీగల్), అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదం కేసులో రెండేళ్ల జైలు శిక్ష, వెయ్యి రూపాయలు జరిమానా విధిస్తూ స్థానిక ఎక్సైజ్ కోర్టు మేజిస్ట్రేట్ జి.స్పందన గురువారం తీర్పు చెప్పారు. ప్రాసి క్యూషన్ కథనం ప్రకారం, గుంటూరు పట్టణంలోని రామనామ క్షేత్రం లోని నాలుగో లైన్‌లో నివసిస్తున్న పసుపులేటి గణేశ్, ఎంబీఏ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఖాళీగా ఉన్న సమయంలో తన తండ్రి హరి శంకరరావు పట్నంబజార్‌లో నిర్వహిస్తున్న హార్డ్ వేర్ షాప్‌లో పని చేసేవాడు. 2021 అక్టోబర్ 12న హార్డ్ వేర్ షాప్‌నకు సంబంధించి ఆర్డర్ తీసుకునేందుకు గుజ్జనగుండ్ల వెళ్లాడు. ఈ క్రమంలో జేకేసీ కాలేజి రోడ్డులో బైక్‌పై వస్తుండగా, ఆర్టీవో ఆఫీసు వైపు నుంచి జేకేసీ కాలేజి వైపు అతివేగంతో వస్తున్న కారు అదుపు తప్పి గణేశ్‌ను ఢీ కొట్టింది. తీవ్రగాయాలైన గణేశ్‌ను ఆస్పత్రికి తరలించగా చికిత్స పొం దుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై రామిరెడ్డినగర్‌కు చెందిన కారు డ్రైవరు కంప రంజన్‌పై గుంటూరు వెస్ట్ ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తు అనంతరం చార్జిషీటు దాఖలు చేశారు. కేసు విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు. ఈ కేసులో ఏపీపీ గాదె వెంకటేశ్వర్లు ప్రాసిక్యూషన్ నిర్వహించారు.

## 250 బస్తాల నూకలు స్వాధీనం

కొల్లిపర, అక్టోబరు 17 ( ఆంధ్రజ్యోతి ) : మండల పరిధిలోని అత్తోటలో అక్రమంగా నిల్వ ఉన్న సుమారు 250 బస్తాల నూకలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ కోటేశ్వరరావు గురువారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం నందివెలుగుకు చెందిన తన్నీరు శ్రీనివాసరావు అత్తోటలో సింగంశెట్టి శంకరరావు ఇంట్లో నూకలను నిల్వ ఉంచినట్లు సమాచారం రావటంతో ఏఎస్ఐ పోతురాజు, హెడ్‌కానిస్టేబుల్ రామకోటేశ్వరరావు, కానిస్టేబుల్‌లు నాగబాబు, అశోక్‌తో కలిసి తనిఖీ చేసినట్లు చెప్పారు. ఈ నూకలు పీడీఎస్ నూకలా, మామూలు బియ్యం నూకలా అని గుర్తించే పరీక్ష నిమిత్తం గుంటూరు పంపినట్లు చెప్పారు. పరీక్ష ఫలితాల అనంతరం కేసు నమోదు చేయనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## 50,582 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 51,885 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 50,582 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 26,786 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరప కాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

| వెరైటీ | కనిష్ఠధర | గరిష్ఠధర | వెరైటీ | కనిష్ఠధర | గరిష్ఠధర |
|---|---|---|---|---|---|
| నాన్ ఏసీ కామన్ వెరైటీ | | | ఏసీ కామన్ వెరైటీ | | |
| 334 | 8500 | 16500 | 334 | 9000 | 16000 |
| నెంబరు.5 | 10000 | 13500 | నెంబరు. 5 | 10000 | 13000 |
| 273 | 10000 | 13500 | 273 | 12000 | 12000 |
| 341 | 9500 | 15000 | 341 | 8500 | 17500 |
| 4884 | 11500 | 16200 | 4884 | - | - |
| సూపర్ 10 | - | - | సూపర్ 10 | - | - |
| నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ | | | ఏసీ స్పెషల్ వెరైటీ | | |
| తేజ | 8000 | 18500 | తేజ | 9000 | 18400 |
| బ్యాడిగి | 8000 | 15500 | బ్యాడిగి | 9000 | 14200 |
| దేవనూరు డీలక్స్ | 9000 | 14500 | దేవనూరు డీలక్స్ | 8500 | 15000 |
| తెల్లకాయలు | 5000 | 11500 | తెల్లకాయలు | 5000 | 10500 |

## రైల్వే గేటు మూసి వేత

సత్తెనపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మరమ్మతుల కారణంగా పట్టణంలోని అచ్చంపేట వెళ్ళే మార్గంలో ఉన్న రైల్వే గేటును గురువారం ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మూసివేశారు. శుక్ర, శనివారాల్లోనూ గేటు మూసి ఉంటుందని రైల్వే అధికారులు తెలిపారు. దీంతో క్రోసూరు, అచ్చంపేట మార్గాల వైపు వెళ్ళే ఆర్టీసీ బస్సు, ఇతర వాహనాలను దారి మళ్ళించారు.

## నేడు జాబ్ మేళా

సత్తెనపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ శుక్రవారం ఉదయం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించనున్నట్టు పల్నాడు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి తమ్మాజీరావు గురువారం విలేకరులకు తెలిపారు. 18 నుంచి 45 సంవత్సరాల వయస్సు కలిగి 10వ తరగతి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, ఇంజనీరింగ్, డిప్లమో, ఫార్మసీ చదివిన నిరుద్యోగ యువత జాబ్ మేళాకు హాజరు కావచ్చన్నారు. వివరాలకు 8074393266, 9160200652 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

## తహసీల్దార్ బదిలీ

రెంటచింతల,అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల తహశీల్దార్ జి.కరుణకుమార్‌ను పత్తిపాడుకు బదిలీ చేస్తూ కలెక్టర్ అరుణ్‌బాబు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన ఇక్కడ మూడు నెలలు పాటు పనిచేశారు. గురజాల తహసీల్దార్ నగేష్‌ను రెంటచింతలకు ఇన్‌చార్జిగా నియమించారు.

## నేటి నుంచి గ్రామ సభలు

సత్తెనపల్లిరూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : భూముల రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో శుక్రవారం నుంచి గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ కేఎస్ చక్రవర్తి తెలిపారు. గురువారం భూరీ సర్వే పూర్తయిన గ్రామాల్లోని రెవెన్యూ అధికారులు, సర్వేయర్స్‌తో ఆయన కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. 18వ తేది కంటెపూడి, 19న భీమవరం, 22న గోరంట్ల, 23న రెంటపాళ్ళ గ్రామాల్లో గ్రామ సభలు జరుగుతాయన్నారు. రైతులు తమ ఫిర్యాదులను, సందేహాలను ఆయా సభల్లో తెలియజేయవచ్చని సూచించారు.

**పెదకూరపాడు :** మండలంలో భూ రీ సర్వే జరిగిన గ్రామాల్లో శుక్రవారం నుంచి రెవెన్యూ గ్రామ సభలు జరుగుతాయని తహసీల్దార్ మీసాల డానియేలు తెలిపారు. 18న రామాపురం, 19న హుస్సేన్ నగరం, 22న గారపాడు, 23న లగడపాడు, 24న జలాలపురం, 25న 75 తాళ్ళూరు, 26న కంభంపాడు, 29న పాటిబండ్ల, 30న కాశిపాడు గ్రామాల్లో ఈ గ్రామ సభలు జరుగుతాయని, ఏమైనా సమస్యలు ఉన్న రైతులు అర్జీల రూపంలో తెలప వచ్చని వివరించారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ గ్రామ సభలు జరుగుతాయని ఆయన వివరించారు.

## హుండీ ఆదాయం రూ.42613

రెంటచింతల,అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రెంటచింతలలోని శివాలయం హుండీ ఆదాయం రూ.4894, కృష్ణానది ఒడ్డున గల సత్రశాల గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి హుండీ ఆదాయం రూ.37713 మొత్తం రూ.42, 613లు వచ్చినట్లు ఈవో గాదే రామిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## ఎమ్మెల్సీ ఓటును నమోదు చేసుకోవాలి

రెంటచింతల,అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) గ్రాడ్యుయేట్లంతా వారి ఎమ్మెల్యే ఓటును నమోదు చేసుకోవాలని మండల యూటీఎఫ్ నేతలు కోరారు. గురువారం యూటీఎఫ్ కార్యాలయంలో గ్రాడ్యుయేట్లకు దరఖాస్తులు అందజేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. 2019 మే లోగా డిగ్రీ పూర్తి చేసిన వారంతా డిగ్రీ ప్రొవిజనల్,ఫోటో,ఓటర్‌కార్డు,మొబైల్ నెంబర్,మెయిల్ ఐడీతో ఓటు నమోదు దరఖాస్తులు ఆన్లైన్ లేదా ఆఫ్ లైన్‌లో నమోదు చేయవచ్చన్నారు. కార్యక్రమంలో యూటిఎఫ్ నేతలు రాజ్‌కుమార్, సాగర్‌బాబు, సుదర్శన్, రామాచారి, వసంతకుమారి పాల్గొన్నారు.

## కౌలు రైతు ఆత్మహత్య

అచ్చంపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొండూరు పంచాయతీ పరిధిలో శ్రీనివాస తండాకు చెందిన కౌలురైతు కేతావత్ వెంకటేశ్వర్లు నాయక్(44) పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. వెంకటేశ్వర్లు నాయక్ రెండు సంవత్సరాలుగా రెండు ఎకరాలు పొలం కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. గతంలో ఉన్న అప్పులు మొత్తం కలిపి రూ.12 లక్షలకు చేరుకున్నాయి. అప్పులు తీర్చే మార్గంలేక మనస్తాపంతో పొలంలోనే పురుగు మందు తాగి మృతి చెందినట్టు అతని భార్య కేతావత్ అంజమ్మ పోలీసులకు తెలియ జేసింది. మృతుడికి ఇద్దరు సంతానం. కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం సత్తెపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్టు అచ్చంపేట సీఐ కే వెంకట ప్రసాదు తెలిపారు.

## నేడు అర్చక సేవా సంఘ సమావేశం

రెంటచింతల,అక్టోబరు 17: పల్నాడు జిల్లా అర్చక సేవా సంఘం సమావేశం శుక్రవారం మాచర్లలోని కోదండరామాలయంలో నిర్వహించనున్నట్లు సంఘ అధ్యక్షుడు చిట్టాల మల్లికార్జునశర్మ తెలిపారు. గురువారం వేణుగోపాల స్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ సమావేశంలో జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక ఉంటుందన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సంఘ రాష్ట్ర అధ్యక్షుడు నారాయణం వేణుగోపాల్, జంధ్యాల వెంకట రామలింగ శాస్త్రి హాజరవుతారని తెలిపారు.

## ప్రజలకు భారంగా ఇసుక విధానం

మాచర్లటౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం ఇసుక విధానం కూటమి నేతలకు వరంగా, ప్రజలకు భారంగా మారిందని మాచర్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి డాక్టర్ యరమల రామచంద్రారెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనలో ఇసుక పాలసీ బాగుందన్నారు. తర్వాత వచ్చిన ప్రభుత్వాలు ఇసుకను ఆదాయ వనరుగా మార్చుకొని దోచేశారని ఆరోపించారు.

# సమస్యలకు నెలవు వీరభద్ర కాలనీ

పేరుకే కాలనీ.. అక్కడ రహదారులు ఉండవు, డ్రెయినేజీ, విద్యుత్ సదుపాయాలు లేవు. కనీసం తాగడానికి నీరు కూడా దొరకదు. కానీ అది ఒక కాలనీ.. అక్కడ ప్రజలు నివసిస్తూ ఉంటారు. తమను ప్రజలుగా ఏ ఒక్క నేతగానీ, అధికారిగానీ గుర్తించి తమ సమస్యలను పరిష్కరించకుండా ఉంటారా? అన్న ఆశతో ఆ కాలనీ వాసులు ఇప్పటికీ అక్కడే జీవిస్తున్నారు. కానీ 16 ఏళ్లుగా ఆ కాలనీలోని ఏ ఒక్క సమస్యను వారు ఎదురుచూసిన వారెవ్వరూ పట్టించుకున్నది లేదు. దీంతో సమస్యలతో సహజీవనం చేస్తూ కాలం గడుపుతున్నారు.





వర్షాలకు ఇళ్ల మధ్య నిలిచిన మురుగు నీరు, చిత్తడిగా మారిన రోడ్లు

అచ్చంపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన అచ్చంపేటలోని వీరభద్రకాలనీ సమస్యలకు నెలవుగా మారింది. కాలనీ ఏర్పడి 16 సంవత్సరాలు దాటినా అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. మౌలిక సదుపాయాలు కల్పించక పోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాలకులు కాలనీ అభివృద్ధి గురించి పట్టించుకోక పోవడంతో 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడనే' అన్న తీరుగా ఉంది.

2008లో కాలనీకి రెవెన్యూ అధికారులు 287 మందికి రెండు సెంట్లు చొప్పున పట్టాలు అందించారు. ప్రస్తుతం 160 కుటుంబాలు నివశిస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు నివశిస్తున్నారు. కాలనీలో పంచాయతీ మూడు బోర్లు నిర్మించారు. కానీ వాటిల్లో ఏ ఒక్కటీ పనిచేయటం లేదు. మరమ్మతులకు నోచుకోక పోవటంతో తాగు నీటి కోసం కాలనీ వాసులు పడరాని పాట్లు పడుతున్నారు. కాలనీకి ఆనుకొని అచ్చంపేట మొత్తానికి మంచి నీరు ఇచ్చే ట్యాంకు ఉన్నప్పటికీ వీరికి మాత్రం మంచి నీరు దొరకదు. డ్రెయినేజీ లేక పోవటంతో కాలనీలో గృహాల్లో వాడుకున్న మురుగు గుంటలుగా మారుతుంది. దీంతో దోమలు వృద్ధి చెందు తున్నాయి. ఇటీవల అనేక మంది వ్యాధుల బారినపడి ఆస్పత్రి పాలైన పరిస్థితి ఉంది. కాలనీలోకి వచ్చేందుకు మూడు ప్రధాన రహదారులు ఉన్నప్పటికీ రెండు రోడ్లు ఆక్రమణకు గురయ్యాయి.

ఇటీవల కురిసిన భారీ వర్షా లకు కాలనీలో పడవల ద్వారా ప్రజలను బయటకు తీసుకువచ్చిన పరిస్థితి ఏర్పడింది. ఆ సందర్భంలో కలెక్టరుతో పాటు స్థానిక ఎమ్మెల్యే కూడా కాలనీని సందర్శించారు. స్థానిక ప్రజలు సమస్యలను వారి దృష్టికి తీసుకు వెళ్లగా స్పందించిన కలెక్టరు, ఎమ్మెల్యే తక్షణమే ఆయా సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కానీ అధికారులెవ్వరూ ఇప్పటి వరకు కాలనీలోని ఏ ఒక్క సమస్యను పరిష్కరించింది లేదని స్థానిక ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా పాలకులు తమ గోడును ఆలకించి, కాలనీలో మౌలిక సదుపాయాలను కల్పించాలని వీరభద్ర కాలనీ వాసులు వేడుకుంటున్నారు.

**పాములు వస్తున్నాయి : ఎస్‌కే రఫీ**



కాలనీలో మురుగు నీరు ఉండటం వల్ల, రోడ్ల పై ముళ్ళ పొదలు ఉండటం వల్ల పాములు సంచరిస్తున్నాయి. మా గోడు ఆలకించే వారు ఎవ్వరూ లేరు. మా సమస్యలు పరిష్కరించి మమ్మల్ని ఆదుకోండి.

**మంచి నీరు ఇవ్వండి : మునగోటి నారాయణ**



గ్రామం మొత్తానికి మా కాలనీ మీదుగా మంచి నీరు వెళ్తుంది. కాని మాకు మాత్రం మంచి నీరు లేదు. పంపులు చెడి పోయినా బాగు చేసే వారే లేరు. మా పై కనికరం చూపించి మా సమస్యలను పరిష్కరించండి.



మట్టి రోడ్డుపై ఏర్పడుతున్న మురుగు గుంటలు

## మౌలిక వసతుల కల్పనే పల్లెపండుగ లక్ష్యం

- ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ
- గ్రామాల్లో అభివృద్ధి పనులకు భూమి పూజ

నకరికల్లు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే పల్లెపండుగ లక్ష్యమని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. గురువారం నకరికల్లు మండలంలోని రూపెనగుంట్ల, కండ్లకుంట, చీమలమర్రి గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా దేచవరంలో రూ.41 లక్షల విలువైన సీసీ రోడ్లకు, రూ.20 లక్షల విలువైన మురుగు కాలువల పనులకు ఎమ్మెల్యే కన్నా భూమి పూజచేశారు. తొలుత రూపెనగుంట్ల ఆంజనేయస్వామి దేవాలయంలో కన్నా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గొర్రెలకు, మేకలకు నట్టలనివారణ వ్యాక్సిన్ వేశారు. అనంతరం కన్నా మాట్లాడుతూ వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ పరిశ్రమలైన పాడి పరిశ్రమ రంగానికి ప్రభుత్వం చేయూతనిస్తుందన్నారు. అనంతరం కండ్లకుంట, చీమలమర్రి గ్రామాల్లో కన్నాకు ప్రజలు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో డీఈఈ ఎస్.శేఖర్‌బాబు, ఏఈలు కే.సురేష్, ఎస్‌కే తస్లీమా, ఎంపీడీవో జీ.కాశయ్య, తహసీల్దార్ కే.పుల్లారావు, జడ్పీటీసీ హరీష్, మొక్కపాటి రామచంద్రరరావు, సాగి శ్రీను, డాక్టర్ సింగరాజు సాయి కృష్ణ, కొనికినేని వెంకట అప్పయ్య, కొత్తపల్లి గోపీ, తొండపి వెంకటరావు, కోడెల అబ్బయ్య, రావెల సత్యనారాయణ, గుంటుపల్లి పూర్ణ చంద్రరరావు, సర్పంచ్ రావెల శాయినవీన్, గంగవరపు కోటేశ్వరరావు, పెమ్మసాని శ్రీనివాసరావు, గంగవరపు కిష్టయ్య, బోడపాటి రామారావు, పాలడుగు శ్రీనివాసరావు, వెంకటరావు, నూనెబోయిన వీరాంజనేయులు, షేక్ అలీ బాషా, అహమ్మద్ పాల్గొన్నారు.



దేచవరం గ్రామంలో పల్లెపండుగ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

## దళిత విద్యార్థికి యరపతినేని భరోసా

- ప్రతి ఏటా 50 వేలు ఆర్థిక సాయం ప్రకటన



విద్యార్థి సుమంత్ కుమార్‌కు రూ.50 వేలు అందజేస్తున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

పిడుగురాళ్ల, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని దాచేపల్లి మండలం శ్రీనగర్ గ్రామానికి చెందిన పందిటి సుమంత్‌కుమార్ నీట్‌లో ర్యాంక్ సాధించాడు. డాక్టర్ సీటు వచ్చే అవకాశం వున్నా ఫీజులు చెల్లించుకోలేని స్థితిలో సుమంత్‌కుమార్ కుటుంబం వున్నట్లు టీడీపీ గ్రామనేతలు ఎమ్మెల్యే యరపతినేని దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే విద్యార్థి సుమంత్‌కుమార్‌ను తనవద్దకు పిలిపించుకొని ఎంబీబీఎస్ చదువు పూర్తయ్యేందుకు ప్రతి ఏటా రూ.50 వేలను తాను అందజేస్తానని భరోసా ఇచ్చారు. అనంతరం ఈ ఏడాదికిగాను రూ.50 వేల నగదుని సుమంత్‌కుమార్ చేతుల్లో పెట్టారు. ఈ సందర్భంగా సుమంత్‌కుమార్ మాట్లాడుతూ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తన విషయంలో ఎంతో మేలు చేశారని, ఆయన చేసిన సాయాన్ని, ప్రోత్సహించిన విధానాన్ని జీవితంలో మర్చిపోలేనని అన్నారు.శ్రీనగర్ గ్రామంలోని మరో విద్యార్థికి ఎమ్మెల్యే యరపతినేని ఆర్థికంగా సాయం చేయటంపై స్థానికులు, దళిత సంఘ నేతలు ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## ఆలయ భూమిలో కార్యాలయాల నిర్మాణంపై విచారణ

రెంటచింతల, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని మంచికల్లు గ్రామ సీతారామాంజనేయస్వామి ఆలయ భూముల్లో వివిధ ప్రభుత్వ భవనాలు నిర్మించి ఆలయానికి ఎటువంటి నగదు చెల్లించలేదని గ్రామానికిచెందిన ఢీకొండ అచ్చయ్య దేవాదాయశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాడు. ఈ నేపథ్యంలో సత్తెనపల్లి దేవాదాయ ఇన్‌స్పెక్టర్ వీ.లీలావతి, ఎండోమెంట్ ఈవో గాదే రామిరెడ్డిలు గురువారం గ్రామాన్ని సందర్శించి భవననిర్మాణాలను పరిశీలించారు. సర్వే నెంబర్ 203లో 1.74 ఎకరాలుండగా అందులో 3 సెంట్లలో ఆర్‌బీకే, 3 సెంట్లలో విలేజ్‌హెల్త్ క్లినిక్, 7.50 సెంట్లలో సహకార సంఘ గోడౌన్‌ను నిర్మించారు. లక్షల విలువైన స్థలంలో నష్టపరిహారం చెల్లించకుండా ప్రభుత్వ భవనాలు నిర్మించారని రాతపూర్వక ఫిర్యాదు అందటంతో విచారణ చేపట్టామని, భూముల వివరాలను సేకరించామని సమగ్ర నివేదికను ఉన్నతాధికారులకు అందచేస్తామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.



ఆలయ భూమిలో నిర్మించిన ఆర్‌బీకేను పరిశీలిస్తున్న ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ వీ.లీలావతి

## ఘనంగా వాల్మీకి జయంతి

పిడుగురాళ్ల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆదికవి వాల్మీకి జయంతిని రాష్ట్రపండుగగా కూటమి ప్రభుత్వం అధికారికంగా ప్రకటించిందని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. గురువారం స్థానిక టీడీపీ కార్యాలయంలో వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాండురంగ శ్రీను, వెంకటేశ్వర్లు, డాక్టర్ కేపీ వెంకయ్య, అంజిబాబు, నాగమల్లికార్జునరావు పాల్గొన్నారు.



పిడుగురాళ్లలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే యరపతినేని

**సత్తెనపల్లి:** పట్టణంలోని బోయ కాలనీలో వాల్మీకి విగ్రహానికి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణతో పాటు మునిసిపల్ మాజీ ఛైర్మన్ ఎలినేడి రామస్వామి, బొర్రా వెంకట అప్పారావు, ఎద్దులదొడ్డి శ్రీనివాస్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

**మాచవరం:** మండలంలోని పలు గ్రామాల్లో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర బోయ హక్కుల పోరాట సమితి కన్వీనర్ ముప్పాన వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరై వాల్మీకి విగ్రహానికి నివాళులర్పించారు.



బోయకాలనీలో వాల్మీకి విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కన్నా

## విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

కారంపూడి,అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతానికి గురై వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలోని బట్టువారిపల్లెలో గురువారం జరిగింది. దాచేపల్లి గ్రామానికి చెందిన జాలే శివనాగేశ్వరరావు (43) కేబుల్‌టీవీ నెట్‌వర్క్‌లో పనిచేస్తున్నాడు. గురువారం బట్టువారిపల్లెలో కేబుల్ వైరు మరమ్మతు నిర్వహించేందుకు నిచ్చెనపై విద్యుత్ స్తంభం ఎక్కుతుండగా పక్కనే ఉన్న విద్యుత్ వైరుతగిలి షాక్‌కు గురై కిందపడి మృతి చెందాడు. ఎస్ఐ వాసు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడికి భార్య సీతా మహాలక్ష్మి, ఇద్దరు కుమారులు ఉన్నారు.

## గ్రామాలను అభివృద్ధి చేద్దాం

వెల్దుర్తి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని ఎంపీపీ సంజీవరెడ్డి, ఉపాధ్యక్షుడు గోపాలరావు అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పలు శాఖల అధికారులు తమ శాఖల పరిధిలో చేస్తున్న అభివృద్ధి పనులను వివరించారు. ముందుగా వాల్మీకి జయంతి సందర్భంగా వాల్మీకి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమావేశంలో ఎంపీడీవో ప్రసాద్, ఇన్‌చార్జి తహసీల్దార్ బాషా, పీఆర్ ఏఈ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

## టీడీపీ ప్రతిష్టను దెబ్బతీస్తే ఏమాత్రం సహించేది లేదు

సత్తెనపల్లి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): నియోజక వర్గంలో టీడీపీ ప్రతిష్టను దెబ్బతీయాలనిచూస్తే సహించేదిలేదని టీడీపీనేతలు వైసీపీ శ్రేణులను హెచ్చరించారు. గురువారం టీడీపీ ప్రజా వేదికలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ నియోజకవర్గంలో నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ అభివృద్ధికి పాటు పడుతున్నారన్నారు. ప్రతిపక్షం నిర్వీర్యమై పోటీచేసిన వ్యక్తి నియోజకవర్గంలో కనుమరుగై పోతే.. కొంతమంది చాటుమాటున ప్రభుత్వ ప్రతిష్టను దిగజార్చే ప్రయత్నాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాగే కొనసాగితే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. సమావేశంలో టీడీపీ అధికార ప్రతినిధులు అళ్ళ సాంబయ్య, పూజల వెంకటకోటయ్య, వెంకటేశ్వరరావు, దివ్వెల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## దుర్గి మండలంలో పల్లెపండుగ

దుర్గి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నెహ్రూనగర్ తండా, కంచరగుంట, మంగాపురంతండా గ్రామాల్లో గురువారం పల్లెపండుగ కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు దుర్గెంపూడి జానకి రామయ్య, జనసేన కన్వీనర్ తోటకూర శ్రీనివాసరావు, జడ్పీటీసీ యలమందలు పాల్గొని సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఏవో శివప్రసాద్, ఏపీవో గంగనబోయిన చిన వెంకటేశ్వర్లు, పంచాయతీ రాజ్ హనుమంతరావు పాల్గొన్నారు.

## పులిచింతల సమాచారం

అచ్చంపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పులిచింతలప్రాజెక్టులో గురువారం 42.16 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 58,467 క్యూసెక్కులు ప్రాజెక్టుకు చేరుతుందన్నారు. ప్రాజెక్టు వద్ద 57,596 క్యూసెక్కులు దిగువ కృష్ణకు విడుదల అవుతుంది. 16వేల క్యూసెక్కులు పవర్‌జనరేషన్ ద్వారా కృష్ణానదికి వస్తుంది రెండు గేట్ల ద్వారా నీరు విడుదల అవుతుంది.

## ఉపాధి పనుల్లో అక్రమాలపై విచారణ

రాజుపాలెం, అక్టోబరు17:ఉపాధి పనుల్లో అక్రమాలు జరిగాయని ఇటీవల ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితం కాగా, ఈ కథనాన్ని రాజుపాలెం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త సీఎం చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎంపీడీవో జీవి సత్యనారాయణ, ఏపీడీ నారాయణ, ఏపీవో వెంకటేశ్వర్లు గురువారం గ్రామంలో విచారణ జరిపారు. ఆ టీడీపీ కార్యకర్తను మండల పరిషత్ కార్యాలయానికి పిలిచి విచారించి సమాచారాన్ని సేకరించినట్లు అధికారులు తెలిపారు.



అంబడిపూడి కృష్ణా నది ఒడ్డున రీచ్‌ను పరిశీలిస్తున్న జేసీ సూరజ్ ధనుంజయ్ ఘనోరే

## ఇసుక రీచ్‌లలో జేసీ తనిఖీ

అచ్చంపేట / పెదకూరపాడు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంబడిపూడి, కోనూరు ఇసుక రీచ్‌లను గురువారం జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ ఘనోరే తనిఖీ చేశారు. అంబడిపూడి 1,2,3, కోనూరు రీచ్‌ల వద్దకు వెళ్లారు. అక్కడ ఇసుక డంపింగ్ చేసేందుకు ప్రైవేట్ భూములను పరిశీలించారు. మండలంలోని కస్తాల, చామర్రు, గింజుపల్లిలో ఇసుక రీచ్‌ల అనుమతి ఇవ్వటానికి అనుకూలంగా ఉన్నాయా? లేవా? అని పరిశీలించి నివేదిక ఇవ్వాలని మండల తహసీల్దార్ గోగినేని శ్రీనివాస్‌ను జేసీ ఆదేశించారు. జేసీతో ఆర్డీవో రమణాకాంత్, ఇతర శాఖల అధికారులు ఉన్నారు.

**పెదకూరపాడులో సివిల్ సప్లయిస్ గోడౌన్ నిర్మాణానికి స్థల పరిశీలన**

సివిల్ సప్లయిస్ గోడౌన్‌ల నిర్మాణ స్థలాన్ని జేసీ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ ఘనోరే పరిశీలించారు. పెదకూరపాడులోని సివిల్ సప్లయ్ గోడౌన్‌లోని బియ్యం, పంచదార, కంది పప్పు, ఆయిల్ ప్యాకెట్లను పరిశీలించారు. నూతనంగా గోడౌన్‌ల నిర్మాణానికి అవసరమైన స్థలంపై తహసీల్దార్ మీసాల డానియేలును వివరాలు అడిగారు. వారి వెంట ఆర్డీవో రమణాకాంత్‌రెడ్డి, తహసీల్దార్ మీసాల డానియేలు, వీఆర్‌వో శ్రీకాంత్, సర్వేయర్లు ఉమా మహేశ్వరరావు, చంద్రశేఖరరెడ్డిలు ఉన్నారు.

## ఎంపీ, ఎమ్మెల్యే చిత్రపటాలకు క్షీరాభిషేకం

రాజుపాలెం,అక్టోబరు17: కొండమోడు-పెరేచర్ల రహదారి విస్తరణకు కేంద్ర ప్రభుత్వం రూ.881 కోట్లు మంజూరు చేయటంలో కృషి చేసిన నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయులు, సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీ నారాయణ చిత్రపటాలకు టీడీపీ రాజుపాలెం అధ్యక్షుడు పల్లపాటి పెద్దిరాజు, నేతలు పలువురు గురువారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పెద్దిరాజు మాట్లాడుతూ కొండమోడు-పెరేచర్ల రహదారి విస్తరణ పల్నాటి ప్రాంత ప్రజల చిరకాల కోరికని, ఎంపీ, ఎమ్మెల్యేల కృషితో త్వరలోనే తమ కోరిక నెరవేరబోతోం దన్నారు. ఈ సందర్భంగా వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నర్రా బాబురావు, నేతలు వాసు, నరసింహారావు, రాజా, అంజనేయులు, రామారావు, వెంకటేశ్వర్లు, శ్రీను, గంగారావు, వీరయ్య, తిలక్, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.



ఎంపీ లావు ఎమ్మెల్యే కన్నా చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న టీడీపీ నేతలు

## చోరీ కేసులో నిందితులకు రిమాండ్

పెదకూరపాడు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జలాలపురంలో బుధవారం తెల్లవారు జామున రూ.1.80 లక్షలు విలువచేసే ఎయిర్‌టెల్ టవర్ బ్యాటరీల చోరీ జరిగింది. ఈ ఘటనలో నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకొని కోర్టుకు హాజరుపర్చగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్ఐ గిరిబాబు తెలి పారు. పెదకూరపాడు పోలీసులు మురళీ, యానాదిరావు పోలీసు గస్తీ నిర్వహిస్తుండగా ఆటోలో ఎయిర్‌టెల్ టవర్‌కి చెందిన 24 బ్యాటరీలను గుంటూరుకు చెందిన దడిగి మణికంఠ, పెదనందిపాడు మండలం పుసులూరి గ్రామానికి చెందిన బిల్ల వెంకటేష్, లక్కుమళ్ళ ధనరాజ్‌లు ఆటోలో తీసుకు వెళ్తున్నారు. ఆసమయంలో గస్తీ పోలీసులు ఆటోను తనిఖీచేయగా చోరీ బయట పడింది. ఈ విషయంపై ఎయిర్‌టెల్ సూపర్‌వైజర్ షేక్ బాజీ ఫిర్యాదు చేశారు.

## సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళనే..

పిడుగురాళ్ల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించకుంటే ఆందోళన బాటపడతామని పల్నాడు జిల్లా వైద్యమిత్ర కాంట్రాక్, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ నేతలు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ పథకంలో 17 ఏళ్లుగా పనిచేస్తున్న వైద్యమిత్రలు, టీమ్‌లీడర్లు, జిల్లా మేనేజర్లు, ఆఫీస్ అసోసియేట్‌లు, జిల్లా మానిటరింగ్ యూనిట్ కేడర్‌ను ఆ పథకంలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. తమ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 14 నుంచి 28 వరకు వివిధ రూపాలలో నిరసన కార్యక్రమాలను చేపడతామని, 29వ తేదీ నుంచి విధులకు గైర్హాజరు అవుతామని తెలిపారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా ఆరోగ్యమిత్ర అసోసియేషన్ అధ్యక్షుడు సాయిబాబా, ఉపాధ్యక్షుడు సుధాకర్, మహిళా అధ్యక్షురాలు మహాలక్ష్మీ, శ్రీనివాస్, సుబ్బలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## మిర్చిలో సుస్థిర వ్యవసాయం అవగాహన

అచ్చంపేట, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని తాడువాయి గ్రామంలో గురువారం జాతీయ సుస్థిర సుగంధ ద్రవ్యాల కార్యక్రమంలో భాగంగా నేలగిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మిర్చిలో సుస్థిర వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన వక్తలుగా శాస్త్రవేత్తలు డాక్టర్ శ్యామ్ సుందర్, విశ్రాంత ఏఈవో డాక్టర్ సాయిబాబు విచ్చేశారు. మిర్చిలో సేంద్రీయ వ్యవసాయ పద్ధతులు, రైతులతో కలిగే లాభాల గురించి వారు వివరించారు. వేసవిలో దుక్కులు దున్నాలని, పచ్చి రొట్టె ఎరువులు, లింగాకర్షక బుట్టలు, జిగురు అట్టల వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తాడువాయి రైతు ఉత్పత్తి దారులసంస్థ సీఈవో బోడెల రవీంద్రారెడ్డి, సర్పంచ్ మంత్రానాయక్, నీలగిరి ఫౌండేషన్ ప్రతినిధి రత్తయ్య రైతులు పాల్గొన్నారు.

## ఆలయ విస్తరణకు స్థలం విరాళం

క్రోసూరు, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి) : క్రోసూరులోని సాయిబాబా గుడి విస్తరణకుగాను గాదిరాజు కుటుంబీకులు సుమారు రూ.30 లక్షలు విలువ చేసే 7.50 ఎకరాల స్థలాన్నివిరాళంగా ఇచ్చినట్టు ఆలయ కమిటీ అధ్యక్షుడు మన్నెం వెంకటరావు తెలిపారు. హైదరాబాద్‌లో స్థిరపడిన క్రోసూరు వాసి గాదిరాజు రామ్మోహనరావు, జయలక్ష్మి, శేషగిరి రావు, నాగరాజకుమారిలు సాయిబాబా గుడికి స్థలాన్ని విరాళంగా ఇచ్చి రిజిస్ట్రేషన్ కూడా చేశారన్నారు. గురువారం దాతలు ఆలయానికి విచ్చేయగా వారి పేరుపై ప్రత్యేక పూజలు నిర్వహించారు. దాతలను పూల దండలతోను, శాలువాలతోను, జ్ఞాపికలతోను సత్కరించారు. ఈ సందర్భంగా అన్నదానం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ కాండ్రు కాశయ్య మన్నెం శ్రీనివాసరావు, నలజాల కోటేశ్వరరావు, అనుముల కోటిరెడ్డి, మైసూర్ బాబు, గోపాలరావు, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.




దాతలను సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

## రైతులతో గురజాల ఆర్డీవో చర్చలు

దాచేపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): చెట్టినాడ్ సిమెంట్ ఫ్యాక్టరీకి భూములు విక్రయించిన రైతులు, ఫ్యాక్టరీ యాజమాన్య ప్రతినిధులతో గురువారం దాచేపల్లి మండలం తక్కెళ్లపాడు గ్రామంలో గురజాలఆర్డీవో మురళీకృష్ణ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమస్యపై మాట్లాడాలని ఆర్డీవో రైతులను కోరగా పలువురు రైతులు సమస్యలను విన్నవించారు. భూములు కోల్పోయిన ప్రతి కుటుంబానికి ఉద్యోగం ఇస్తామని, ఫ్యాక్టరీకి చుట్టుపక్కల పొలాలపై దుమ్ము, ధూళి పడకుండా కాపాడతామని ఫ్యాక్టరీ యాజ మాన్యం తమకు హామీ ఇచ్చిందన్నారు. అయితే ఇచ్చిన హామీలు ఏవీ అమలుకాలేదని, దీనిపై పలుమార్లు ఫ్యాక్టరీ యాజమాన్యం వద్దకు వెళ్లి ప్రశ్నించినా స్పందించలేదన్నారు. ఫ్యాక్టరీ యాజమాన్య ప్రతినిధులు మాట్లాడుతూ.. అర్హతలను బట్టి అవకాశం వున్నంత వరకు ఉద్యోగ అవకాశాలు కల్పించామని, మరికొన్నింటిని పరిశీలనలో వుంచినట్లు వివరించారు. ఇరువర్గాల వాదనలు ఆలకించిన ఆర్డీవో సమాచారాన్ని నమోదుచేసుకొని సమావేశాన్ని ముగించారు. సమావేశంలో దాచేపల్లి తహసీల్దార్ వైవీ కుటుంబరావు, దాచేపల్లి మండల సర్వేయర్ ఈ.శ్రీనివాసరావు, ఆయా గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

## విద్యుత్ బకాయిలు వసూలు చేయండి

పిడుగురాళ్ల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సబ్‌డివిజన్ పరిధిలో విద్యుత్ బకాయిలను ఎప్పటికప్పుడు వసూలు చేసేలావుండాలని విద్యుత్ శాఖ పల్నాడు జిల్లా ఎస్ఈ విజయ్ కుమార్ తెలిపారు. గురువారం పిడుగురాళ్ల విద్యుత్ సబ్ డివిజన్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. విద్యుత్ బకాయి వసూళ్లపై ప్రత్యేక కార్యాచరణ పెట్టుకోవాలని అధికారుకు సూచించారు. వివిధ రికార్డులను పరిశీలించారు. పిడుగురాళ్ల ఇన్‌చార్జి ఏడీఈగా డిప్యూటీ ఈఈ ఎ రామయ్య బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.




కొండమోడు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్ఈ విజయ్‌కుమార్

# సాగర్ నుంచి నీటి విడుదల

● దిగువకు 4 క్రస్ట్‌గేట్ల ద్వారా..

మాచర్లటౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ 4 క్రస్ట్‌గేట్ల ద్వారా అధికారులు గురువారం నీటిని విడుదల చేశారు. 4 గేట్లను 5 అడుగుల మేర ఎత్తి 32400 క్యూసెక్కుల నీటిని దిగువకు పంపుతున్నారు. కాగా సాగర్ నీటి మట్టం 590 అడుగులు ఉంది. ఇది 312.04 టీఎంసీలకు సమానం. కుడి కాల్వ ద్వారా 8067, ఎడమ కాల్వ ద్వారా 6173, ప్రదాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29476, క్రస్ట్‌గేట్ల ద్వారా 32400, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్ఎల్‌సీ ద్వారా 400 మొత్తం ఔట్‌ఫ్లో 78916 క్యూసెక్కులు నీరు దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో 78916 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.


క్రస్ట్‌గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

# షూటర్ ముఖేష్‌కు సత్కారం



నేలవల్లి ముఖేష్‌ను సత్కరిస్తున్న కేఎల్‌యూ వీసీ డాక్టర్ పార్థివర్మ

తాడేపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జూనియర్ ప్రపంచ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో భారత్ తరపున పాల్గొని ఐదు బంగారు పతకాలను సాధించిన షూటర్ నేలవల్లి ముఖేష్‌ను కేఎల్‌యూ వీసీ డాక్టర్ జీ పార్థసారధివర్మ సత్కరించారు. వర్సిటీలో గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో వీసీ మాట్లాడుతూ తమ విద్యార్థి అయిన ముఖేష్ ఇటీవల పెరూ దేశంలోని లిమాలో జరిగిన ప్రపంచ షూటింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో భారత్ తరపున ప్రాతినిధ్యం వహించి ప్రతిభ చూపారన్నారు. వర్సిటీలో సీఎస్ఐటీ మూడో సంవత్సరం చదువుతున్న ముఖేష్ ఆరు విభాగాల్లో జాతీయ జట్టుకు ఎంపికై 10 పతకాలకు పోటీపడగా ఐదు బంగారు పతకాలు సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోవీసీలు డాక్టర్ ప్రసాద్, వెంకటరామ్, రాజశేఖర్‌రావు, రిజిస్ట్రార్ సుబ్బారావు, డీన్ డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్, క్రీడల అసోసియేట్ డీన్ డాక్టర్ కే హరికిషోర్ తదితరులు పాల్గొన్నారు.

నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్

# సమయపట్టిక మార్పు

● 18వ తేదీ నుంచి రాత్రి 10.55కే గుంటూరుకు రాక
● తిరుపతికి వేకువజామున 5.55కే చేరిక

గుంటూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): నెంబరు. 12734 లింగంపల్లి - నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్‌ని పాత సమయపట్టికలోనే నడిపేందుకు రైల్వే శాఖ నిర్ణయించింది. ఈ రైలు షెడ్యూల్‌ని ఇంచుమించు ఏడాది క్రితం మార్చినప్పటి నుంచి అర్ధరాత్రి దాటాక గుంటూరుకు వస్తున్నది. ఇక తిరుపతి చేరేసరికి ఉదయం 8 గంటల సమయం అవుతుండటంతో ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం(ఈ నెల 18వ తేదీ) నుంచి షెడ్యూల్‌ని మారుస్తున్నట్లు రైల్వే శాఖ ప్రకటించింది. ఇక నుంచి నిత్యం సాయంత్రం 5.30 గంటలకు లింగంపల్లిలో బయలుదేరి సికింద్రాబాద్‌కు 6.05కి వచ్చి 6.10కి బయలుదేరుతుంది. ఈ రైలు నల్గొండకు రాత్రి 7.37కి, మిర్యాలగూడకు 8.04కి, నడికుడికి 8.34కి, పిడుగురాళ్లకు 8.54కి, సత్తెనపల్లికి 9.22కు, గుంటూరుకు 10.55కి వస్తుంది. గుంటూరులో 10 నిమిషాల హాల్టింగ్ అనంతరం రాత్రి 11.05కి బయలుదేరి తిరుపతికి మరుసటి రోజు వేకువజామున 5.55కి చేరుతుంది. మారిన షెడ్యూల్ ప్రయాణీకులకు ఉపయోగకరంగా ఉంటుందని గుంటూరు డీఆర్ఎం ఎం రామకృష్ణ తెలిపారు.

నిర్దేశించిన విధానాలు పాటిస్తేనే

# రైతులకు అధిక లాభాలు

-డీఏఓ వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు

గుంటూరు సిటీ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): నిర్దేశించిన విధి విధానాలు తప్పనిసరిగా పాటించడం వలన రైతులకు నాణ్యమైన ఉత్పత్తి లభించి అధిక లాభం పొందడంతో పాటు సుస్థిర వ్యవసాయానికి దోహద పడుతుందని జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం కృషి భవన్‌లో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల వ్యవసాయ అధికారులకు ఇండి గ్యాప్ సర్టిఫికేషన్ శిక్షణ తరగతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఇండి గ్యాప్ సర్టిఫికేషన్ ముఖ్యఉద్దేశం వ్యవసాయ అధికారులు కచ్చితంగా అర్థం చేసుకుంటేనే కార్యక్రమం ద్వారా మంచి ఫలితాలు సాధిస్తామని అన్నారు. ఎంపిక చేసిన రైతులకు ఇండి గ్యాప్ సర్టిఫికేషన్‌పై పూర్తి అవగాహన కల్పించాలని, తద్వారా వారికి ఎన్నో మెరుగైన అవకాశాలు దక్కుతాయని అన్నారు. ఈ విధానంలో ప్రతి మండలంలో 5 నుంచి 6 మంది రైతులను డివిజన్ స్థాయిలో ఒక ఎఫ్ పీ వో కు అనుసంధానం చేసి, వారు పండించిన ఉత్పతుల నాణ్యతను ఎన్ ఏ బీ ఎల్ గుర్తింపు కలిగిన ల్యాబ్‌ల ద్వారా పరీక్షించి స్కోప్ సర్టిఫికేట్ జారీ చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ బాలు నాయక్, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ ఎం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


రంగు వేయని బెల్లంతో తయారుచేసిన నల్ల జిలేబి


తెనాలిలో తయారుచేసే బెల్లం జిలేబి



# తరాలు మారినా.. తరగని తియ్యదనం

తెనాలి... ఈ పట్టణం పేరు వినగానే సినీ, నాటకరంగ కళాకారులు, స్వాతంత్రోద్యమ వీరులు గుర్తొస్తారు. అయితే మూడు కాల్వలు ప్రవహించే తెనాలికి ఆంధ్రాప్యారిస్ అనికూడా మరో ప్రత్యేకమైన పేరుంది. అయితే తెనాలికే ప్రత్యేకతను తెచ్చిపెట్టిన వంటకం ఏదంటే మాత్రం తెనాలి పట్టణవాసులకే కాకుండా దేశ, విదేశాల్లోని వారికి గుర్తొచ్చేది బెల్లం జిలేబి. ఇది ఎంతగానంటే ఆ పదం నోటి వెంట వచ్చిందంటే చాలు... నోరూరిపోవాల్సిందే. స్వచ్ఛమైన రంగు లేని బెల్లం, రంగు వేసిన బెల్లం వంటివాటితో రెండు రకాలుగా తయారు చేస్తుండటంతో జిలేబి ప్రియులకు జిహ్వాచాపల్యం తీరిపోయినట్టే.

- నోరూరించే తెనాలి బెల్లం జిలేబి
- ఆరు దశాబ్దాల నుంచి తెనాలికి ప్రత్యేకం
- దేశ విదేశాల్లోని జిలేబి ప్రియుల కోసం ఇక్కడి నుంచి పార్సిల్స్
- ఒక వీధికే జిలేబి కొట్ల బజారుగా పేరుతెచ్చిపెట్టి...

తెనాలి, అక్టోబరు 17, (ఆంధ్రజ్యోతి): మినప పప్పు, బియ్యపు పిండి, మైదాను ఉపయోగించి జిలేబీ చుట్టలు తయారు చేయటం ఇక్కడి ప్రత్యేకత. ముందురోజే పిండి సిద్ధం చేసుకుని నిల్వ ఉంచాల్సి రావటంతో అన్ని ప్రాంతాల్లో బెల్లం జిలేబీని తయారు చేయటానికి ఆసక్తి చూపరు. ఎక్కువ శాతం పంచదార జిలేబీనే తయారు చేస్తుంటారు. కనీసం 8 గంటలు పిండి నిల్వ ఉండాల్సి ఉండటం, ఒక రోజులో ఎంతమంది కొనుగోలు చేస్తారనేది తేలని విషయం కావటంతో మిగిలిన ప్రాంతాల్లో ఇది ప్రాచుర్యం పొందలేదు. అయితే తెనాలి జిలేబీకి 60 ఏళ్ళ చరిత్ర ఉండటం, స్థానికులే కాకుండా దేశంలోని ఇతర పట్టణాలు, నగరాల నుంచి వచ్చినవారు కూడా తప్పనిసరిగా కొనుగోలు చేస్తారు. దీంతో ఇక్కడి జిలేబీకి మంచి డిమాండ్ ఉండటంతో భారీ స్థాయిలో తయారు చేస్తుంటారు. ఎప్పుడు చూసినా వేడిగా జిలేబీ లభించటానికి ఆ డిమాండే కారణం కూడా. తెనాలి వచ్చారంటే జిలేబీ తీసుకోకుండా ఇతర ప్రాంతాలవారు వెళ్లరంటే అతిశయోక్తి కాదు. అయితే దీని జిహ్వాచాపల్యం ఇక్కడితో ఆగకుండా విదేశాలకూ పాకింది. అమెరికా, ఆస్ట్రేలియా, జర్మనీ వంటి దేశాలకు ఇక్కడి నుంచి పార్శిల్స్ కూడా వెళతాయంటే తెనాలి జిలేబీకి ఎంతటి ప్రాముఖ్యత ఉందనేది అర్థమవుతుంది. కరోనా ముందు తెనాలి పట్టణంలో 50కిపైగా జిలేబి దుకాణాలుంటే, ప్రస్తుతం 20కి తగ్గాయి. అయితే దీని ఆదరణ మాత్రం తగ్గలేదు. తెనాలిలోని సత్యన్నారాయణ టాకీస్ ఉన్న రోడ్‌లఈ జిలేబీ దుకాణాలు ఉండటంతో ఈ రోడ్డుకు జిలేబీ కొట్ల బజారుగా పేరు మారిపోయింది. వాస్తవానికి ఈ రోడ్ పేరు యాకూబ్ హుస్సేన్ రోడ్. అయితే జిలేబి దుకాణాలు పెద్ద సంఖ్యలో ఉండటంతో ఆ పేరునుకాస్తా జిలేబికొట్ల బజారుగా జనం మార్చేశారు. రోజుకు ఒక్కో దుకాణంలో 50 నుంచి 80 కిలోల జిలేబీ అమ్మకాలు జరుగుతుంటాయని చెబుతారు. ఒక్క నెలలో రూ. 12 లక్షల నుంచి రూ. 15 లక్షల వ్యాపారం ఒక్క జిలేబి అమ్మకాలపైనే సాగుతుందంటే జిలేబీ ప్రియులు ఎంతమందున్నారనేది అర్థమవుతుంది.

సుమారు 100 సంవత్సరాల నుంచి జిలేబి వంటకం ఇక్కడ తయారీలో ఉందనే ప్రచారం ఉంటే, ఇప్పటి తరం చెబుతున్న ఆధారాల ప్రకారం మాత్రం ఆరు దశాబ్దాల నుంచి బెల్లం జిలేబి తయారీ ఉందని చెబుతున్నారు. 1965లో తొలిసారి చీమకుర్తి సుబ్బయ్య అనే వ్యక్తి రంగులేని బెల్లం జిలేబీని ఆ రోజుల్లోనే తయారు చేశారనేది నానుడి. రంగు లేకుండా నల్లగా ఉండటంతో కంటికి తినాలనిపించేలా లేకపోవటంతో 1972లో బొట్లగుంట్ల రామయ్య అనే వ్యక్తి రంగు వేసిన బెల్లంతో నోరూరించేలా జిలేబీని తయారు చేసేవారని చెబుతుంటారు. అయితే రంగు వేసినా కర్నాటక నుంచి ప్రత్యేకంగా తెప్పించుకున్న బెల్లాన్ని ప్రస్తుతం వాడుతున్నామని వ్యాపారులు చెబుతుంటారు.

జిలేబీ తయారీకి సంబంధించి సమయం, శ్రమ తగ్గించే యంత్రాలు చాలానే వచ్చినా ఇక్కడ మాత్రం ఎటువంటి పరికరాన్ని వాడకుండా, ప్రత్యేకంగా తయారు చేయించిన దవళ వస్త్రంలాంటి దానిలో పిండివేసి, దానికున్న రంధ్రం ద్వారా జిలేబీ చుట్టలు నూనెలో వేసి తయారు చేస్తుంటారు. ఇక్కడి జిలేబీకి అంతటి ప్రత్యేకత రావటానికి ఇవన్నీ కారణమయితే, బెల్లంకూడా ఒక ప్రత్యేకమే. నోరూరించే జిలేబీ రోజూతిన్నా వెగటు లేకుండా జనం ఆదరించటానికి దీని తయారీనే ఓ ప్రత్యేకం. పైగా బెల్లంతో తయారు చేయటంతో ఐరన్ పోషకాల వంటి ఆరోగ్యకర లక్షణాలు కూడా దీని సొంతమనేది స్థానికులు చెప్పేమాటే. అదీ తెనాలి బెల్లం జిలేబీ చరిత్ర. మీకూ నోరూరిపోతుందా! అయితే వెంటనే మీది తెనాలి... మాది తెనాలే అంటూ తెనాలి బాట పట్టాల్సిందే.

# అమరావతిలో నేషనల్ గేమ్స్‌కు కృషి

◆ మంగళగిరి స్టేడియంలో స్పోర్ట్స్ సిటీ ఏర్పాటు ◆ సౌత్ జోన్ జూనియర్ అథ్లెటిక్స్ మీట్‌లో ఎంపీ కేశినేని


క్రీడా జెండా ఎగురవేస్తున్న ఎంపీ చిన్ని, పక్కన ఎమ్మెల్యే నరేంద్ర, వీసీ గంగాధర్ రావు తదితరులు



పెదకాకాని, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని ప్రాంతంలో 2027లో నేషనల్ గేమ్స్ నిర్వహణకు సీఎం చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారని ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ తెలిపారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో గురువారం 35వ సౌత్ జోన్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్షిప్-2024 గేమ్స్ ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొన్నారు. తొలుత ఆయన ఏపీ అథ్లెటిక్స్ అసోసియేషన్ పతకాన్ని ఆవిష్కరించి క్రీడాకారుల నుంచి గౌరవ వందన స్వీకరించిన అనంతరం ప్రసంగించారు. క్రీడలను ప్రోత్సహించడానికి చంద్రబాబు ఎప్పుడూ ముందుంటారన్నారు. మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో డిసెంబరు నుంచి జనవరి వరకు ప్రతి గ్రామంలో క్రీడా సంబరాలు నిర్వహిస్తామన్నారు. గ్రామీణ క్రీడాకారులను వెలుగులోకి తీసుకురావాలనే క్రీడా సంబరాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలోని ప్రతి స్టేడియాన్ని శాప్ తరపున అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. మంగళగిరిలోని క్రికెట్ స్టేడియాన్ని ఏడాదిన్నర లోపు అందుబాటులోకి తెస్తామని చెప్పారు. ఈ స్టేడియంలోనే క్రీడాకారులకు ఉపయోగపడేలా స్పోర్ట్స్ సిటీ ఏర్పాటు చేస్తామన్నారు. క్రీడలపై పిల్లల్లో ఆసక్తి పెరిగితే ఇంటర్‌నెట్, సోషల్ మీడియాకి దూరంగా ఉంటారన్నారు. శాప్ ఛైర్మన్ రవినాయుడు, ఎమ్మెల్యే దూళిపాళ్ల నరేంద్ర మాట్లాడుతూ గత ప్రభుత్వం క్రీడలను, క్రీడాకారులను నిర్లక్ష్యం చేసిందన్నారు. రాష్ట్రంలో అసంపూర్తిగా వదిలేసిన క్రీడా వికాస కేంద్రాలను అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో శాప్ వైస్ ఛైర్మన్, ఎండీ పి.ఎస్.గిరీష్, ఎస్ఆర్ఎమ్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ మనోజ్ కే అరోరా, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ గంగాధరరావు, రెక్టార్ కె.రత్నషీలామణి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సింహాచలం తదితరులు పాల్గొన్నారు.



## నందిగం బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా

### హత్య కేసు వివరాలు సమర్పించాలని పోలీసులకు హైకోర్టు ఆదేశం

అమరావతి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మరియమ్మ అనే మహిళ హత్య కేసులో బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ వైసీపీ మాజీ ఎంపీ నందిగం సురేశ్ దాఖలు చేసిన పిటిషన్ గురువారం హైకోర్టులో విచారణకు వచ్చింది. ఈ కేసు పూర్తి వివరాలు సమర్పించాలని పోలీసులను ఆదేశిస్తూ.. విచారణను వారం రోజులు వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కె కృపాసాగర్ గురువారం ఉత్తర్వులిచ్చారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం వెలగపూడి గ్రామానికి చెందిన మరియమ్మ 2020 డిసెంబర్ 27న హత్యకు గురైంది. ఆమె కుమారుడి ఫిర్యాదు ఆధారంగా తుళ్లూరు పోలీసులు కేసు నమోదు చేశారు. కేసులో నందిగం సురేశ్‌ను 78వ నిందితుడిగా చేర్చారు. ఈ కేసులో పోలీసులు ఇటీవల ఆయన్ను అరెస్ట్ చేశారు. బెయిల్ పిటిషన్‌ను గుంటూరు ప్రత్యేక కోర్టు కొట్టివేయడంతో.. సురేశ్ హైకోర్టును ఆశ్రయించారు.

## వైద్యాధికారి ఆత్మహత్యాయత్నం

### ఉన్నతాధికారుల ఒత్తిడి కారణమని ఆరోపణ


చికిత్స పొందుతున్న డాక్టర్ కమలాకర్‌రావు

వినుకొండ టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఉన్నతాధికారుల ఒత్తిడి తట్టుకోలేక ఈపూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ టి.కమలాకర్‌రావు ఆత్మహత్యకు యత్నించాడు. వినుకొండ ప్రభుత్వాస్పత్రిలో ఆయన చికిత్స పొందుతున్నాడు. తనకు వైద్యశాల బాధ్యతలు వద్దని ఉన్నతాధికారులకు చెప్పినా సీనియర్ అని ఆయనకు బాధ్యతలు అప్పగించారు. ఆరోగ్యశ్రీ డీఈవో అనంతకిశోర్ మాటలు నమ్మి ఆస్పత్రి నిధుల నుంచి కమలాకర్‌రావు రూ.లక్ష ఇచ్చారు. ఆ సొమ్ము ప్రభుత్వానికి చెల్లించాలని, క్షమాపణ పత్రం రాసివ్వాలని అనంతకిశోర్‌ను అడగ్గా ఆయన నిరాకరించాడు. ఈ విషయాన్ని తన బంధువైన డీసీహెచ్‌వో రంగారావుకు అనంతకిశోర్ తెలిపాడు. దీంతో డీసీహెచ్‌వో వైద్యశాలను సందర్శించి లేని పోని వంకలతో కమలాకర్‌రావుపై విధులకు సంబంధించి ఒత్తిడి పెంచారు. ఇదే సమయంలో ఆస్పత్రిలోని ఫార్మాసిస్టు కక్షకట్టి అనంతకిశోర్‌తో కలిసి నిత్యం వేధిస్తుండేవారని కమలాకర్‌రావు వాపోయారు. అనంతకిశోర్‌కు చెల్లించిన నగదు రికవరీ కాకాపోతే తన ఉద్యోగం పోతుందని, రూ.40 లక్షల అప్పులున్నాయని ఆందోళన, వేధింపులతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు కమలాకర్‌రావు తెలిపారు. ఈ విషయంపై జిల్లా కోఆర్డినేటర్(డీసీహెచ్‌వో) రంగారావును వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

## సచివాలయ డిస్పెన్సరీలో గుండెపోటు నివారణ ఇంజెక్షన్లు

అమరావతి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): అమరావతిలోని రాష్ట్ర సచివాలయ సివిల్ డిస్పెన్సరీలో గుండెపోటు నివారణ ఇంజెక్షన్లు అందుబాటులో ఉన్నాయని డిస్పెన్సరీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హదస్సా తెలిపారు. సచివాలయ ఉద్యోగులు అత్యవసర సమయాల్లో ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని గురువారం ఓ ప్రకటనలో కోరారు.

# హత్యాయత్నం కేసులో నిందితుల అరెస్టు

సత్తెనపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రంగాకాలనీకి చెందిన రాగినూతల కరుణపై హత్యాయత్నం చేసిన కేసులో నిందితులైన పాలమాను పూర్ణచంద్రరావు, పల్లపు అంకమరావులను అరెస్టు చేసినట్టు సత్తెనపల్లి డీఎస్పీ ఎం హనుమంతరావు తెలిపారు. గురువారం పట్టణ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన వివరాలు ప్రకటించారు. సహజీవనం చేస్తున్న భారతీ అనే మహిళను పూర్ణచంద్రరావు కొట్టడంతో ఆమె కన్పించకుండా వెళ్లిపోగా ఆమె విషయం తల్లి కరుణమ్మకు తెలుసని పూర్ణచంద్రరావు కత్తితో ఇష్టం వచ్చినట్లు గాయపరిచాడు. ఆ తర్వాత స్నేహితుడైన పల్లపు అంకమరావుతో కలిసి బైక్‌పై పరారయ్యాడు. కేసు విచారణలో నిందితులు ఇద్దర్నీ గుర్తించి అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారని డీఎస్పీ తెలిపారు. తనకు ప్రాణహాని ఉందని కరుణమ్మ ఫిర్యాదు చేసిందని నిందితులపై రౌడీషీట్లు తెరుస్తామన్నారు. నిందితులను అరెస్టు చేసినపట్టణ ఎస్ఐ సంధ్యారాణిని, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.


నిందితుల అరెస్టు చూపుతున్న డీఎస్పీ హనుమంతరావు

# వైసీపీకి.. పచ్చధనం

(మొదటి పేజీ తరువాయి)

పచ్చని మొక్కలను భారీగా కొనుగోలు చేయించి కార్యక్రమాల ప్రాంగణాలను అలంకరింపచేసేవారు. ఈ వ్యవహారాల్లో వైసీపీ నేతలు, అధికారులు కలిసి రూ.కోట్ల నిధులు దోచేశారన్న విమర్శలు ఉన్నాయి.

**కొన్నారు.. కొట్టేశారు**

ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి హోదాలో జగన్ తెనాలి వచ్చినప్పుడు రెండు గంటల కార్యక్రమానికి రూ.3.8 లక్షల విలువైన మొక్కలను మున్సిపాలిటీ కొనుగోలు చేసింది. కార్యక్రమం తర్వాత వాటిని పట్టణంలోని పార్కుల్లో నాటలేదు. 80 శాతం మొక్కలు దగ్గర్లోని నర్సరీలకు అమ్మేశారు. రూ.3.8 లక్షలకు బిల్ చేయించి నేతలు జేబులో వేసుకున్నారు. అంటే కొన్నా, అమ్మినా డబ్బే. కొనడానికి రూ.3.8 లక్షలు ఖర్చయితే, అమ్మిన మొక్కల తాలూకు రూ.2.4 లక్షల వరకు అదనపు ఆదాయం వచ్చినట్లు సమాచారం. ఇది ఒక్క తెనాలిలోనే కాదు. పొన్నూరు, రేపల్లె, బాపట్ల, గుంటూరు కార్పొరేషన్, ఒకటి కాదన్నట్లు అన్ని చోట్లా దోపిడీ తంతే. అయితే మంగళగిరి, తాడేపల్లి మున్సిపాలిటీల్లో ఈ దోపిడీకి లెక్కేలేదనేది అధికారుల మాటే. కొన్నట్లు బిల్లులు చూపినా తర్వాత మొక్కలు చూపాలని, అమ్మేస్తే ఎలాగని మున్సిపల్ సిబ్బంది నిలదీసినా పట్టించుకోకుండా వైసీపీ నేతలే కొందరు అమ్మేసుకున్నారని చెబుతున్నారు. తెనాలి, పొన్నూరు వంటి మరికొన్ని మున్సిపాలిటీల్లో పార్కుల నిర్వహణ చూసే ఉద్యాన విభాగంలో పనిచేసే సూపర్‌వైజర్‌లు, ఇతర సిబ్బంది అమ్ముకున్న పరిస్థితీ ఉంది.

**సుందరీకరణలో చేతివాటం..**

పట్టణ, నగర ప్రజలకు కాస్తంత ఆహ్లాదాన్ని పంచేది, యాంత్రిక జీవనంలో జనం సేద తీరేది పార్కుల్లోనే. అలాంటి పార్కుల అభివృద్ధి, పచ్చదనం కోసం ప్రభుత్వం భారీగా వివిధ విభాగాల నుంచి మున్సిపాలిటీలకు నిధులు మంజూరు చేస్తోంది. పట్టణ సుందరీకరణ పేరుతో డివైడర్లపై, పార్కుల్లో మొక్కలు నాటేందుకు ఖరీదైన మొక్కలను కొనుగోలు చేస్తున్నారు. ఇటీవల తెనాలి-విజయవాడ నాలుగు లైన్ల రహదారి మధ్య డివైడర్‌పై మొక్కలు నాటేందుకు రూ.25 లక్షలను మంజూరు చేసే అంశాన్ని కౌన్సిల్ ఆమోదించింది. దీనికి సంబంధించి మొక్కలను కొనుగోలు చేసి రెండు లారీల్లో తెచ్చారు. వాటిలో కొన్నిటిని మాత్రమే పెట్టారు. మిగిలినవాటిలో కొన్నిటిని వాటర్‌వర్క్స్ ప్రదేశంలో పెట్టారు. వీటిలో చేతివాటం ఎంతనేది లెక్కలు చూడాల్సిందే. ఇదే తరహాలో మరికొన్ని మున్సిపాలిటీల్లో పార్కుల అభివృద్ధి, పట్టణ సుందరీకరణ నిధులు అక్రమార్కుల జేబుల్లోకి వెళతున్నాయి. తాడేపల్లి, మంగళగిరి మున్సిపాలిటీల్లో సుందరీకరణ పేరుతో గత వైసీపీ సర్కారు ఉన్నప్పుడు రూ.68 లక్షలు కేటాయించి, వాటిలో ఎన్ని మొక్కలు తెచ్చారో! ఎన్ని నాటారో కూడా లెక్కలేదు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా తెనాలి వంటి కొన్ని మున్సిపాలిటీల్లో ఇంకా వైసీపీకి చెందిన కిందిస్థాయి నాయకులే మున్సిపల్ పనుల్లో, మొక్కల కాంట్రాక్ట్‌ల్లో చక్రం తిప్పుతూ నిధులు దోచేస్తున్నారన్న ఆరోపణలున్నాయి.



# పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

### తుఫాను బాధితులకు విరాళం

నరసరావుపేట కల్చరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఇటీవల తుఫాను వలన సర్వం కోల్పోయిన బాధితుల కోసం స్థానిక శంకర భారతీపురం పాఠశాల స్కౌట్, ఎన్‌సీసీ విద్యార్థినులు విరాళాలు సేకరించారు. విద్యార్థినులు మొత్తం 42వేల రూపాయలను చెక్కు రూపంలో గురువారం కలెక్టర్ పి.అరుణ్‌బాబుకు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులను కలెక్టర్ ప్రశంసించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఎం.పార్వతి, స్కౌట్ మాస్టర్ పమ్మి వెంకటరెడ్డి, ఎన్‌సీసీ అధికారి షేక్ పాతిమాలు పాల్గొన్నారు.

### రేపు మెగా జాబ్ మేళా

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట నియోజకవర్గ పరిధిలోని నిరుద్యోగ యువత కోసం ఈ నెల 19వ తేదీన శనివారం మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్టు మాజీమంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ప్రకటించారు. పట్టణంలోని ప్రత్తిపాటి గార్డెన్‌లో రేపు ఉదయం 9గంటలకు మెగా జాబ్ మేళాను ప్రారంభించనున్నట్టు ఆయన గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నిరుద్యోగ యువతీ యువకులు 2016 నుంచి 2024 మధ్య ఉత్తీర్ణులైన వారందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న 10వ తరగతి ఉతీర్ణులైన, ఫెయిల్ ఐన ఐటీఐ డిప్లమో కాని, ఇంటర్ పూర్తయిన వారితో పాటు డిగ్రీ, బీటెక్, ఎంటెక్, పీజీ, ఫార్మా చదివిన వారందరూ ఈ జాబ్ మేళాకు హాజరు కావాలని ఆయన కోరారు. 30కి పైగా కంపెనీలు, వెయ్యికి పైగా ఆఫర్లతో ఈ జాబ్ మేళాకు హాజరవుతున్నాయన్నారు. ఈ జాబ్ మేళాను అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ప్రత్తిపాటి పిలుపు నిచ్చారు.

### నేత్రదానం అభినందనీయం: చలపతిరావు


రామయ్య (ఫైల్‌ఫొటో)

వేల్పూరు (శావల్యాపురం) అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): చనిపోయిన వ్యక్తి నేత్రాలు మరొకరికి దానం చేసి వారికి చూపును ప్రసాదించడం అభినందనీయమని అమ్మ నేత్ర, అవయవ, శరీరదాన ప్రోత్సాహకుల సంఘం పల్నాడు జిల్లా కో ఆర్డినేటర్ సంద్రపాటి చలపతిరావు అన్నారు. శావల్యాపురం మండలంలోని వేల్పూరు గ్రామానికి చెందిన కుమ్మరిపల్లి రామయ్య (మిల్లు రామయ్య) వృద్ధాప్యంతో గురువారం మృతిచెందగా ఆయన కుటుంబసభ్యులు రామయ్య నేత్రాలను దానం చేశారు. చలపతిరావు ఇచ్చిన సమాచారంతో పెదకాకాని శంకర్ ఆసుపత్రి ఐ-బ్యాంక్ సిబ్బంది వేల్పూరుకొచ్చి మృతుడు రామయ్య కళ్ళలోని కార్నియా పొరలు సేకరించారు. నేత్రదానంపై ప్రజలంతా అవగాహన కలిగి ఉండాలని, మృతదేహాన్ని ఏసీబాక్స్‌లో పెట్టి 8గంటలలోపులో నేత్రదానం చేయాలని, వ్యక్తి చనిపోయిన వెంటనే ఐ-బ్యాంక్ సిబ్బందికి సమాచారమివ్వాలన్నారు. నేత్రదానంతో పలువురికి ఆదర్శంగా నిలిచిన రామయ్య కుటుంబసభ్యులు వీరబ్రహ్మం, ప్రసన్న, గాయత్రి, రాజరాజేశ్వరి, లోహిత్‌కుమార్‌లను ఐబ్యాంక్ సిబ్బంది, గ్రామస్థులు అభినందించారు.

### ఇంకా ప్రభుత్వ మద్యం అమ్మకాలు

రొంపిచర్ల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 16వ తేదీన ప్రభుత్వం నూతన మద్యం పాలసీని ప్రవేశ పెట్టింది. ఐతే గతంలో ఉన్న మద్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకోకపోవటంతో రొంపిచర్లలోని ఒక షాపులో నిర్వాహకులు షట్టర్ ముందు ఉంచి నూతన మద్యాన్ని అమ్ముతున్నారు. కాగా ఈ విషయంపై ఎక్సైజ్ సీఐ వెంకటేశ్వర్లును వివరణ కోరగా గోడౌన్ అధికారులు పాత మద్యాన్ని తీసుకు వెళ్ళాల్సి ఉందని తెలిపారు. ప్రభుత్వం సుమారు నెల రోజుల నుంచి నూతన మద్యం పాలసీపై కసరత్తు చేస్తుంటే ఎక్సైజ్ శాఖ అధికారులు గతంలో ఉన్న మద్యాన్ని తరలించటంలో నిర్లక్ష్యం వహించారని విమర్శలు వినవస్తున్నాయి.

### ఫ్లెక్సీలు చించివేత

నాదెండ్ల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నరసరావుపేట - చికలూరిపేట రహదారి పక్కన ఉన్న బసికాపురం గ్రామ సమీపంలో ఏర్పాటుచేసిన టీడీపీ ఫ్లెక్సీని గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం రాత్రి చించివేశారు. కొద్ది రోజుల క్రితం ఇర్లపాడు కేంద్రీయ విద్యాలయం నుంచి కనపర్రు రోడ్డు వరకు నిర్మించనున్న మెటల్ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే పుల్లారావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, ఎంపీల ఫొటోలతో ఫ్లెక్సీని నాయకులు ఏర్పాటుచేశారు. ఈ ఫ్లెక్సీని కొన్నిచోట్ల కత్తిరించిన విషయాన్ని గురువారం ఉదయం గుర్తించారు. బసికాపురం గ్రామానికి చెందిన వైసీపీ నేత ఒకరు ఈ పని చేసినట్టుగా అనుమానిస్తున్నారు

### నేటి నుంచి గ్రామ సభలు

నాదెండ్ల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో శుక్రవారం నుంచి గ్రామ సభలు నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ ఏవీ రమణ గురువారం తెలిపారు. 18వ తేదీన సాతులూరు, 19న చందవరం, 22న చిరుమామిళ్ళ, 23న సంక్రాంతిపాడు, 24న గొరిజవోలు, 25న తూబాడు, 26న కనపర్రు, 28 ఇర్లపాడు, 29వ తేదీ గణపవరం గ్రామాల్లో గ్రామ సభలు జరుగుతాయన్నారు. ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు జరిగే ఈ గ్రామ సభల్లో రీ సర్వేతో పాటు ఇతర సమస్యలకు సంబంధించి సమస్యలు ఉంటే అర్జీలు ఇవ్వాలని ఆమె కోరారు.

### ఎంఏఎం ఫార్మసీలో క్యాంపస్ డ్రైవ్

నరసరావుపేట టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కేసానుపల్లిలోని ఎంఏఎం ఫార్మసీ కళాశాలలో దివీస్ లాబొరేటరీస్ క్యాంపస్ డ్రైవ్ నిర్వహించిందని కళాశాల చైర్మన్ మేదరమెట్ల రామశేషగిరిరావు గురువారం తెలిపారు. ఎంపికైన విదార్థులు ట్రైనీ సూపర్‌వైజర్, గ్రాడ్యుయేట్ అప్రెంటీస్‌గా అర్హత పొందుతారన్నారు. క్యాంపస్ డ్రైవ్‌లో 50మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.ప్రసాదరావు మాట్లాడుతూ ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులకు ఏడాదికి రూ.3లక్షల వేతనం, బ్యాచిలర్లకు వసతి, యూనిఫాం, పీఎఫ్, ఈఎస్‌ఐ భోజన ఖర్చులో రాయితీ ఇస్తారన్నారు.

## శాఖల సమన్వయ లోపం ... ప్రజలకు శాపం

● హైవేస్, మున్సిపాలిటీ పరస్పర ఆరోపణలు
● మురుగు, వరద నీరు అంతా రోడ్డుపైనే
● ఇబ్బందులు పడుతున్న వాహనదారులు


చిలకలూరిపేట - గణపవరం మధ్య రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు నీరు


ఏఎంజీ సమీపంలో జాతీయ రహదారిపైనే ప్రవహిస్తున్న వరద నీరు

నాదెండ్ల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రెండు శాఖల మధ్య సమన్వయ లోపం ప్రజలకు శాపంలా మారింది. దీంతో ఆ రహదారిలో ప్రయాణించే వాహనదారులు, ప్రజలు కష్టాలు పడుతున్నారు. వర్షం కురిస్తే చాలు చిలకలూరిపేట పట్టణంలోని మురుగు నీరంతా జాతీయ రహదారిపైనే ప్రవహిస్తుండటంతో సర్వీస్ రోడ్డులో రోజుల తరబడి నీరు నిలిచిపోతోంది.

టీడీపీ ప్రభుత్వ హయాంలో 2018లో చిలకలూరిపేట పట్టణంలోని స్వచ్ఛంద సేవా సంస్థ ఏఎంజీ పక్కగా సిమెంట్ రోడ్డుతో మురుగు కాలువ నిర్మాణం చేశారు. పోలిరెడ్డిపాలెం, ఎన్‌టీఆర్ కాలనీ, కుమ్మరి కాలనీ తదితర కాలనీలకు చెందిన మురుగునీరు, పొలాల్లోని వర్షపునీరు ఆ కాలువ గుండానే గణపవరం సరిహద్దులోని (ఏఎంజీ పక్కన) ఉన్న జాతీయ రహదారికి చెందిన కాలువలోకి చేరుతోంది. కాలువ చిన్నగా ఉండటంతో ఆ ప్రాంతంలోని సర్వీస్ రోడ్డు పైకి నీరు చేరడంతో పాటు జాతీయ రహదారిపైకి కూడా వరద నీరు ప్రవహిస్తోంది. అంతే గాకుండా ఏఎంజీ సంస్థ ప్రాంగణంలోకి ఆ నీరు చొచ్చుకు వచ్చి విద్యార్థులు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు.

**కల్వర్టు పూడికతో మురుగునీరంతా డొంకలోనే**

జాతీయ రహదారికి పక్కన ఉన్న చౌదరయ్య హెల్త్ క్లబ్ సమీపంలో జాతీయ రహదారి కింద ఉన్న కల్వర్టు ద్వారా మురుగునీరు, వర్షపునీరు కుప్పగంజి వాగులోకి వెళ్లాల్సి ఉంది. ప్రస్తుతం ఆ కల్వర్టు వ్యర్థాలతో పూడిపోయి నీరు ముందుకు సాగటం లేదు. జాతీయ రహదారి విస్తరించి మూడు దశాబ్దాలు అయినప్పటికీ హైవేస్ వారు పూడిక తీయలేదు. అంతేగాకుండా ప్రస్తుతం ఉన్న కాలువపై షాపుల నిర్మాణం చేయటంతో ఆ ప్రాంతంలో కూడా పూడిక తీయలేదు. దీంతో ఆ నీరంతా గణపవరం డొంక గుండా ప్రవహించి వాగులోకి చేరుతున్నది. ఈ క్రమంలో మురుగునీరు, వర్షపునీరు డొంకపై గుండా ప్రవహించడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అంతేగాకుండా ఈ ప్రవాహంతో రహదారి కూడా గుంతలమయంగా మారింది. ఈ రహదారి గుండానే గణపవరంతో పాటు నాదెండ్ల మండలంలోని పలు గ్రామాలకు చెందిన వందలాదిమంది ప్రతిరోజు చిలకలూరిపేటకు ప్రయాణిస్తుంటారు.

**ఆరు సంవత్సరాలుగా నిర్లక్ష్యమే..**

ఆరు సంవత్సరాలుగా ఇలాంటి పరిస్థితి నెలకొన్నా జాతీయ రహదారులతో పాటు మున్సిపల్ అధికారులు కంటి తుడుపు చర్యలే చేపట్టారు తప్ప శాశ్వత పరిష్కారానికి చొరవ చూపలేదు. పట్టణ పరిధిలోని ఏఎంజీ సంస్థ వరకు మాత్రమే పూడిక తీశారు కానీ ఆక్రమణల జోలికి వెళ్లలేదు. ప్రస్తుతం ఉన్న కాలువ పరిమాణాన్ని పెంచి మరో కాలువ నిర్మాణం చేస్తేనే సమస్య పరిష్కారమవుతుంది. ఐతే ఆ కాలువతో మాకు సంబంధం లేదని, హైవేస్ వారిదే బాధ్యత అని, మున్సిపల్ అధికారులు చెపుతున్నారు. మున్సిపాలిటీ నుంచి వచ్చే నీటిని తమ కాలువలోకి ఎలా మళ్లిస్తారని? హైవేస్ వారు ప్రశ్నిస్తున్నారు. ఇలా ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకోవడమే కానీ సమస్య మాత్రం పరిష్కారం కాలేదు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారాన్ని చూపాలని ప్రజలు కోరుతున్నారు.

## చిరస్మరణీయుడు వాల్మీకి మహర్షి

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు


వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి, టీడీపీ నాయకులు

చిలకలూరిపేట అర్బన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): చిరస్మరణీయులు వాల్మీకి మహర్షి అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు కొనియాడారు. వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా చిలకలూరిపేటలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు గురువారం వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బోయవానిగా పుట్టి మహర్షిగా రూపాంతరం చెందారన్నారు. రామాయణాన్ని మహా కావ్యంగా మలచి భారతదేశ కుటుంబ వ్యవస్థ విధానాన్ని మహా గ్రంథంగా ఆవిష్కరించిన మహోన్నత వ్యక్తి వాల్మీకి మహర్షి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కాగా మునిసిపల్ కార్యాలయంలో వాల్మీకి జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి మునిసిపల్ చైర్మన్ రఫానీ, కమిషనర్ శ్రీహరిబాబు, మునిసిపల్ డీఈ అబ్దుల్ రహీం పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను అధికారికంగా ప్రకటించటమే కాకుండా ఘనంగా నిర్వహించటంపై ఏఐవైఎఫ్, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. గురువారం పట్టణంలో గిరిజన సంఘ కార్యాలయంలో వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదే విధంగా విప్లవ వీరుడు కొమరంభీమ్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ నెల 22వ తేదీన కొమరం భీమ్ జయంతి కార్యక్రమాన్ని అధికారికంగా నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీ శ్రీను నాయక్, కే నాగేశ్వరరావు, వెంకట్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

● యడ్లపాడు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మానవ చరిత్ర ఉన్నంత కాలం మరిచిపోలేని నిత్య స్మరణీయులు వాల్మీకి మహర్షి అని పలువురు టీడీపీ నాయకులు కొనియాడారు. యడ్లపాడులోని చెన్నకేశవపురంలో వాల్మీకి జయంతి ఉత్సవాలను గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పోపూరి రాఘవయ్య, గోనుగుంట్ల హరిబాబు, పారా హరిబాబు, రవికిరణ్, బలరామ్, చంటి, అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

**మౌలిక సదుపాయల కల్పనే ప్రభుత్వ లక్ష్యం**

నాదెండ్ల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తున్నదని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పల్లారావు అన్నారు నాదెండ్ల మండలం ఎండుగుంపాలెం, చిలకలూరిపేట మండలం గోపాళంవారిపాలెం గ్రామాల్లో గురువారం జరిగిన పల్లె పండుగలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎండుగుంపాలెం గ్రామ పరిధిలో రూ.56లక్షల వ్యయంతో ఎండుగుంపాలెం నుంచి అప్పాపురం వరకు నిర్మించనున్న బీటీ రోడ్డుతో పాటు గ్రామంలో నిర్మించనున్న సిమెంట్ రోడ్లు, గోపాళంవారిపాలెంలో రూ.కోటి వ్యయంతో నిర్మించనున్న నాలుగు కిలోమీటర్ల రహదారి, సీసీ రోడ్లు తదితర పనులకు శంకుస్థాపన చేసి శిలాఫలకాలు ఆవిష్కరించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ నాయకులు అధికారులపై బ్లాక్ మెయిల్ రాజకీయాలకు దిగుతున్నారరని విమర్శించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీడీవో ఎస్.స్వరూపరాణి, ఎంపీపీ దేవినేని శంకరరరావు, సర్పంచ్ గోరంట్ల కోటేశ్వరరావు, పార్టీ అధ్యక్షుడు జే మదనమోహన్, నాయకులు గట్టినేని రమేష్, చిన్నం రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### రోగులకు అంకితభావంతో సేవలందించాలి

● జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి రవికుమార్


శావల్యాపురంలో వైద్యసిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో రవికుమార్

శావల్యాపురం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): వైద్య చికిత్సల నిమిత్తం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చిన రోగులకు వైద్య సిబ్బంది అంకితభావంతో వారికి ఉన్నతమైన వైద్య సేవలందించాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి రవి కుమార్ అన్నారు. శావల్యాపురం పీహెచ్‌సీని ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీ సిబ్బంది పని తీరు తదితర అంశాలను పరిశీలించారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ రెండోసారి పీహెచ్‌సీకొచ్చే రోగులను ఓపీల్లో చేర్చకుండా రెండో రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. పీహెచ్‌సీ సేవల గురించి రోగులకు అవగాహన కల్పించి ఓపీల సంఖ్యను పెంచాలని, వారికి అన్ని రకాల ల్యాబ్‌పరీక్షలు ఉచితంగా నిర్వహించాలన్నారు. ఆరోగ్య, ఆశా కార్యకర్తలు గ్రామాల్లోని ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండేలా పర్యవేక్షణ చేయాలని, గర్భిణులు, బాలింతలకు సకాలంలో అన్ని వైద్యసేవలను అందించాలన్నారు. పీహెచ్‌సీలో సాధారణ కాన్పుల సంఖ్యను పెంచాలని, రోగులకు అందించే వైద్యసేవలను సకాలంలో ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. పీహెచ్‌సీ వెనుక ఖాళీస్థలాన్ని పరిశీలించి చెత్తచెదారం లేకుండా పరిశుభ్రంగా ఉంచాలన్నారు. వైద్యాధికారి మాన్యం రాధాకృష్ణన్, సూపర్‌వైజర్‌లు ఏడుకొండలు, ఉమాదేవి, స్టాఫ్‌నర్స్ ధనలక్ష్మి, ల్యాబ్‌టెక్నీషియన్లు సీతారామయ్య, సతీష్, ఫార్మసిస్ట్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### ప్రమాదాలు జరిగే ప్రదేశాలను పరిశీలించిన ఎస్పీ

చిలకలూరిపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట ప్రాంతంలో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ప్రదేశాలను పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు గురువారం పరిశీలించారు. పట్టణంలోని ఏఎంజీ సంస్థ సమీపంలోని చెక్ పోస్టు, ఆర్టీసీ బస్టాండ్, పురుషోత్తమపట్నం అడ్డరోడ్డు సెంటర్, కోంద్రుపాడు, నరసరావుపేట సెంటర్, పసుమర్రు, కావూరు, లింగంగుంట్ల, బొప్పూడి గుడి జంక్షన్ తదితర ప్రదేశాలను ఆయన సందర్శించారు. డీఎస్పీ నాగేశ్వరరావు, ఎస్బీ సీఐ బండారు సురేష్ బాబు, చిలకలూరిపేట అర్బన్, రూరల్ సీఐ లు రమేష్ బాబు, సుబ్బనాయుడు ఆయన వెంట పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ తరచూ రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. మైనర్ బాలలు, విద్యార్థులు రాత్రి సమయాల్లో బైకులపై తిరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవలని అర్బన్, రూరల్ సీఐలను ఆయన ఆదేశించారు.

### ప్రజా సమస్యలను తక్షణం పరిష్కరించాలి: ఆర్డీవో మధులత



వినుకొండ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను తక్షణం పరిష్కారించాలని నరసరావుపేట ఆర్డీవో కె.మధులత అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఆమె ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. ఈసందర్భంగా ఆమె తహసీల్దార్ సురేష్‌తో కలిసి వివిధ శాఖల సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమస్యలను పరిష్కార వేదికల ద్వారా వచ్చిన అర్జీలను త్వరగా పరిష్కరించాలని సూచించారు.

**రెవెన్యూ గ్రామ సభలతో భూ సమస్యలకు పరిష్కారం**

ఈపూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ గ్రామ సభల ద్వారా భూ సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని నరసరావుపేట రెవిన్యూ డివిజనల్ ఆఫీసర్ మధులత అన్నారు. ఈపూరు రెవెన్యూ కార్యాలయాన్ని గురువారం ఆమె సందర్శించారు. వీఆర్వోలు,గ్రామ సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. మ్యుటేషన్ విషయంలో ఆలస్యం జరగకుండా చూడాలన్నారు. అనంతరం విలేకరులతో ఆమె మాట్లాడారు. రీసర్వే పారదర్శకంగా నిర్వహిస్తామన్నారు. గతంలో జరిగిన రీసర్వేలో ఉన్న పొరపాట్లను సరిచేసేందుకు గ్రామ సభల ద్వారా అర్జీలు స్వీకరించడం జరుగుతుందన్నారు. మ్యుటేషన్ విషయంలో ఫీల్డ్ వెరిఫికేషన్ తప్పనిసరిగా జరిపించాలన్నారు. ఈపూరు మండలం అంగలూరులో ఉత్తరాది మఠానికి చెందిన 1254.22 ఎకరాలు భూములకు త్వరలో ఉత్తరాది మఠం వారితో చర్చలు జరిపి పట్టాదారు పుస్తకాలు ఇచ్చేందుకు ప్రయత్నం చేస్తామన్నారు. రీ సర్వే జరిగిన గ్రామాలలో ఈ నెల 15వ తేదీ నుంచి రెవెన్యూ గ్రామ సభలు నిర్వహిస్తామన్నారు. మండలంలో చిట్టాపురం, బొమ్మరాజుపల్లి, వనికుంట, ఈపూరు, గుండేపల్లి గ్రామాలలో రెవెన్యూ గ్రామసభలు నిర్వహిస్తున్నామన్నారు. రీసర్వేలో జరిగిన పొరపాట్లుపై అర్జీలు పెట్టుకోవాలన్నారు. సమావేశంలో తహసీల్దారు నళిని, వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

### టీడీపీపై విమర్శలు హాస్యాస్పదం: ధారునాయక్

నరసరావుపేట టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): అవినీతి సామ్రాట్లు టీడీపీ మీద విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందని టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం ధారునాయక్ అన్నారు. గురువారం పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో మీడియా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎం ధారునాయక్ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం హయాంలో ప్రవేశపెట్టిన ప్రభుత్వ మద్యం దుకాణాలలో జే బ్రాండ్ల మద్యం మాత్రమే విక్రయించేవారన్నారు. వినియోగదారులు కోరుకున్న రకాలేవి దొరికేవి కాదని, జాతీయ, అంతర్జాతీయ బ్రాండ్లన్నీ కనుమరుగు చేశారన్నారు. వైసీపీ ప్రభుత్వం నాసిరకం మద్యం అధిక ధరలకు అమ్మకాలు జరిపి జేటాక్స్ రూపంలో కోట్లాది రూపాయిలు జగన్‌రెడ్డి ప్యాలెస్‌లోకి చేరాయన్నారు. సమావేశంలో రాష్ట్ర తెలుగురైతు అధికార ప్రతినిధి గొట్టిపాటి జనార్దన్‌బాబు, రాష్ట్ర టీడీపీ హెచ్‌ఆర్‌డీ సభ్యుడు వల్లెపు నాగేశ్వరరావు, రాష్ట్ర తెలుగు రైతు నాయకుడు కొల్లి ఆంజనేయులు, బీ వెంకటేష్ నాయక్, ఆర్ రామ్‌సింగ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.


ఘాట్ రోడ్డులో విరిగిపడిన బండరాళ్లు, వర్షం తాకిడితో కొట్టుకుపోయిన రోడ్డు

### ఘాట్ రోడ్డులో విరిగిపడిన కొండచరియలు

వినుకొండ టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): వినుకొండపై ఉన్న శ్రీరామలింగేశ్వర స్వామి ఘాట్ రోడ్డు కొండచరియలు విరిగిపడడంతో ప్రమాదకరంగా మారింది. గతంలో టీడీపీ ప్రభుత్వం హయాంలో వినుకొండ ఘాట్ రోడ్డు అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో 2.50 కి.మీ. పొడవు, 9మీటర్ల వెడల్పుతో రోడ్డు నిర్మించేందుకు పనులు ప్రారంభించారు. అనంతరం వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సుమారు రూ.7కోట్ల రూపాయలతో ప్రభుత్వ నిధులతో, పంచాయతీరాజ్ డీఈఈ కొండయ్య సారథ్యంలో రోడ్డు నిర్మాణ పనులకు మరోసారి శ్రీకారం చేపట్టారు. మొత్తం నాలుగు మలుపులతో మొదటి దశ పనులు పూర్తయ్యాయి. తొలి ఏకాదశి పండుగ సందర్భంగా భక్తులకు రాకపోకలకు వీలుగా రోడ్డును ఏర్పాటుచేశారు. ఇటీవల ఎడతెరపిలేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా రెండో మలుపు నుంచి మూడో మలుపు రోడ్డు కొండ చరియలు విరిగిపడడంతో రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. ప్రభుత్వం మారడంతో ఘాట్ రోడ్డు నిర్మాణ పనులు ఆగిపోయాయి. ఇటీవల కురిసిన వర్షాలకు కొండపై ఉన్న కోనేరులో వర్షం నీరుచేరింది. కోనేరులోని వర్షం నీటి ఊట తాకిడికి రోడ్డు ఇరువైపులా ఉన్న కొండ చరియలు విరిగిపడుతున్నాయి. గత పాతికేళ్లలో కోనేరు నిండటం ఎప్పుడూ చూడలేదని భక్తులు చెబుతున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలతో కోనేరుకు కొద్ది రోజుగా కురుస్తున్న వర్షంతో ఘాట్ రోడ్డు ఇప్పటికే భారీ కోతకు గురైంది. గతంలో వేసిన రోడ్డు ఆనవాలు చెరిగిపోయాయి. రానున్న రోజుల్లో కొండ చరియలు విరిగిపడకుండా, నాణ్యతా ప్రమాణాలతో రోడ్డు నిర్మిస్తే ప్రమాదాలను అరికట్టవచ్చని భక్తులు చెబుతున్నారు.

### అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

నూజెండ్ల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జంగాలపల్లి, త్రిపురాపురం, మారెళ్ళవారిపాలెం, వీ అప్పాపురం గ్రామాల్లో ప్రజా ప్రతినిధులు, అధికారులు గురువారం పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీడీవో పీ ఉమాదేవి, సర్పంచ్‌లు కూచిపూడి చినవెంకటేశ్వర్లు, గొట్టం బ్రహ్మరెడ్డి, దాసరి రవీంద్ర, వినుకొండ మాజీ మార్కెట్ యార్డు చైర్మన్‌గా సుబ్బారెడ్డి, మాజీ సర్పంచ్ నక్కా బుల్లీశ్వరరెడ్డి, పంచాయతీరాజ్ ఏఈ అల్లాభక్షు, ఏపీవో ఆంజనేయరాజు, ఇన్‌చార్జ్ ఈవోపీఆర్‌డీ ప్రభాకరరావు, పంచాయతీ కార్యదర్శులు వెంకటేశ్వర్లు, సందీప్, శ్యాండిల్, చెన్నారావు, మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

### కే-రిడ్జి స్కూల్‌లో మాక్స్ విజన్ మెగా కంటి పరీక్షలు

నరసరావుపేట టౌన్, అక్టోబరు 17: స్థానిక కే-రిడ్జి స్కూల్‌లో మాక్స్ విజన్ అధినేత డాక్టర్ చెంచురెడ్డి ఆధ్వర్యంలో గురువారం మెగా కంటి పరీక్ష శిబిరం నిర్వహించారు. అన్ని తరగతుల చిన్నారులకు కంటి పరీక్షలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జీ బర్నబాస్, చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు, పాఠశాల డైరెక్టర్ కె. నాసరయ్య, స్కూల్ ఇన్‌చార్జి కోట బాపూజీ, అకడమిక్ కో ఆర్డినేటర్ హేమంత్ పాల్గొన్నారు.


వాల్మీకి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న కలెక్టర్ అరుణ్ బాబు, అధికారులు

### వాల్మీకి జీవితం ఆదర్శనీయం: కలెక్టర్

నరసరావుపేట కల్చరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రామాయణాన్ని ప్రపంచానికి పరిచయం చేసిన వాల్మీకి మహర్షి జీవితం ఆదర్శనీయమని కలెక్టర్ పి.అరుణ్‌బాబు తెలిపారు. వాల్మీకి జయంతిని రాష్ట్ర పండుగగా ప్రకటించిన నేపథ్యంలో గురువారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్లో జరిగిన కార్యక్రమంలో వాల్మీకి చిత్రపటానికి కలెక్టర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రామాయణం రచించి సమాజ శ్రేయస్సుకు అవసరమైన ఎన్నో జీవన సూత్రాలను అందించిన వాల్మీకి మహర్షికి జాతి రుణపడి ఉంటుందన్నారు. కృషి ఉంటే మనుషులు ఋషులవుతారని వాల్మీకి జీవితం ద్వారా తెలుసుకోవచ్చన్నారు. వాల్మీకి కుల సంఘాల నాయకులు తెలిపిన పలు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీఆర్వో వినాయకం, జిల్లా అధికారులు, వాల్మీకి, బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.


అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అరవిందబాబు

### అభివృద్ధికి ప్రాధాన్యం: ఎమ్మెల్యే అరవిందబాబు

రొంపిచర్ల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్టు ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు పేర్కొన్నారు. మండలంలోని మాచవరం, కొత్తపల్లి, కండ్లకుంట గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మూడు గ్రామాల్లో రూ.64 లక్షలతో నిర్మించబోయే సిమెంట్ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణాలకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చదలవాడ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించినట్టు తెలిపారు. కూటమి ప్రభుత్వం పల్లెల ప్రగతికి కృషి చేస్తుందన్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దఎత్తున నిధులు కేటాయించినట్టు తెలిపారు. రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహణ కార్యదర్శి గోనుగుంట్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ గత ప్రభుత్వం రహదారులకు ప్రాధాన్యం ఇవ్వలేదన్నారు. కార్యక్రమంలో రంగిశెట్టి రామకృష్ణ, పులకూరి జగ్గయ్య, పల్లెల నాగిరెడ్డి, గాడిపర్తి సురేష్, మొండితోక రామారావు, శాఖమూరి రామ్మూర్తి, లింగా వెంకటేశ్వర్లు, వడ్లమూడి వెంకట కిషోర్, యాంపాటి కోటిరెడ్డి, పోతిరెడ్డి అంజిరెడ్డి, పొనుగోటి రామారావు తదితరులు పాల్గొన్నారు.

### రాష్ట్రాభివృద్దే సీఎం చంద్రబాబు లక్ష్యం

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్

నరసరావుపేట టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు తీసుకెళ్ళడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబునాయుడు పాలన సాగుతోందని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధితో పాటు యువతకు ఉపాధి కల్పన లక్ష్యంతో ప్రభుత్వం రాష్ట్రంలో పెట్టుబడులు సాధించి పరిశ్రమలు ఏర్పాటుచేసి వారి బంగారు భవిష్యత్తుకు పునాది వేస్తున్నారని అన్నారు. ఒక్క చాన్స్ అని అధికారంలోకి వచ్చిన సైకో పాలనలో రాష్ట్రం 30 ఏళ్ళు వెనక్కి వెళ్ళిపోయిందన్నారు. గత ప్రభుత్వంలో రంగులు వేసేందుకు మూడు వేల కోట్లు, భూములు సరిహద్దు రాళ్ళకు రూ.700ల కోట్లు ఖర్చుచేశారని ఆవేదన వ్యక్తం చేశారు. చరిత్ర చూడని విధంగా రూ.4500 కోట్లతో, 30వేల అభివృద్ధి పనులతో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పల్లె పండుగ నిర్వహిస్తున్నారని చెప్పారు.


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

### అభివృద్ధిని చూసి ఓర్చుకోలేక పోతున్న జగన్

● ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

వినుకొండ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): వైసీపీ, కూటమి ప్రభుత్వాల మధ్య తేడా ఏంటో నాలుగు నెలలుగా జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలే చెబుతున్నాయని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు తెలిపారు. మండలంలోని ఏనుగుపాలెంలో రూ.14 లక్షలు సీసీ రోడ్లు, డ్రైయిన్లు నిర్మాణంతోపాటు, పిట్టంబండలో గ్రామాల్లో గురువారం పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. ఆసందర్భంగా గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే మక్కెనతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు త పాటు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో రూ 4500 కోట్లుతో గ్రామాల్లో వేలాది అభివృద్ధి పనులు ప్రారంభించుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో డ్వామా పీడీ సిద్ది లింగ మూర్తి. మండల పార్టీ అధ్యక్షుడు ఎం.ఆంజనేయులు. క్లష్టర్ ఇన్‌చార్జి ఎం.రా మబ్రహ్మం, వి.కృష్ణారెడ్డి, ఎం.కొండలు, ఎం.ఏడుకొండలు, కె.వెంకటరెడ్డి, వి. ఆనంద్, ఎం.చిరంజీవి, ఎం.కృష్ణ, బి.గోవిందరాజులు. కె.వెంకటేశ్వరెడ్డి, గోవిందరాజులు, ఎం.అంజిరెడ్డి, ఆర్.రామాంజినేయులు, అధికారులు పాల్గొన్నారు.

తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలంటూ

### ఎమ్మెల్యే కార్యాలయం వద్ద ధర్నా

నరసరావుపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘంలో తొలగించిన కాంట్రాక్టు కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో గత 15 రోజులుగా అందోళనలు నిర్వహిస్తున్నారు. మూడు రోజులుగా మునిసిపల్ కార్యాలయం ఎదుట కార్మికలు రిలే దీక్షలు చేస్తున్నారు. అందోళనను కార్మికులు ఉధృతం చేశారు. మునిసిపల్ కార్యాలయం నుంచి గుంటూరు రోడ్డులోని ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే కార్యాలయం ఎదుల ధర్నా చేశారు. తొలగించిన తొమ్మిది మంది కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, సదరు కార్మికులకు రెండు నెలల వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు న్యాయం చేయాలని కోరుతూ కలెక్టరేట్, మునిసిపల్ కార్యాలయాల్లో వినతి పత్రాలు సమర్పించారు. అధికారులు స్పందించకపోతుండటంతో కార్మికులు రిలే నిరహార దీక్షలు చేపట్టారు. సీఐటీయూ నేతలు సిలార్ మసూద్, షేక్ చిన్న అల్లాభక్షు తదితరులు అందోళనలకు నాయకత్వ వహిస్తున్నారు. కార్యాలయం ఎదుట అందోళనలు కొనసాగుతున్నా మునిసిపల్ అధికారులు చర్చలు జరిపే ప్రయత్నాలు చేయకపోవటం గమనార్హం.

### కులాలకు, మతాలకు అతీతంగా జాన్ డేవిడ్ సేవలు

● ఏఎంజీ డైరెక్టర్ డాక్టర్ అరుణ కుమార్ మహంతి

చిలకలూరిపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కులాలకు, మతాలకు అతీతంగా సేవలు అందించిన వ్యక్తి డాక్టర్ జాన్ డేవిడ్ అని ఏఎంజీ డైరెక్టర్ డాక్టర్ అరుణ కుమార్ మహంతి, సార్ కార్నర్స్ డైరెక్టర్ జెస్సీఎస్ బర్నబాస్‌లు అన్నారు. ఏఎంజీ, సార్ కార్నర్, వేదా సంస్థల వ్యవస్థాపకులు జాన్ డేవిడ్ జయంతిని గురువారం ఆయా సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో పాటు విద్యార్థులు, ఉద్యోగులు సమాధి వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం పట్టణంలోని రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ఉన్న జాన్ డేవిడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గుండయ్యతోటలోని నిరీక్షణ ప్రార్థనా మందిరం, ఏఎంజీ సంస్థ ప్రాంగణాల్లో జరిగిన సభల్లో వారు మాట్లాడుతూ పేద వర్గాల పిల్లలు ఉన్నత స్థాయికి ఎదగాలనే లక్ష్యంతో విద్యా సంస్థలను జాన్ డేవిడ్ స్థాపించి వేలాదిమందికి ఉచిత విద్య అందించారన్నారు. చిలకలూరిపేట వాసుల దాహార్తిని తీర్చేందుకు భూరి విరాళాన్ని అందించిన ఆయన సేవలను ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు కార్యక్రమాల్లో కుటుంబ, బోర్డు సభ్యులు డాక్టర్ జాన్ సుల్తక్షన్, సాంబయ్య, మోజెస్, పీటర్ తదితరులు పాల్గొన్నారు. కాగా కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎం.రాధాకృష్ణ ఆధ్వర్యంలో జాన్ డేవిడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.